# మహాత్మా జోతిరావు పూలే

## (నాటకం)

- ✶ *ఈ నాటకం 2009 సం॥లో నంది నాటకోత్సవాల్లో పాల్గొని ఉత్తమ నటునికి నంది బహుమతిని పొందింది.*
- ✶ *'సాక్షి' దినపత్రిక ఫన్‌డే అనుబంధంలో ప్రతీవారం సీరియల్‌గా ప్రచురితమైంది.*

ఈ నాటకాన్ని మొట్టమొదట కీ॥శే॥ ప్రసాద్ మూర్తి దర్శకత్వంలో కళావాణి ఉభయ గోదావరిలో ప్రదర్శించారు. ఆ సమాజంలోని నటీనట బృందం

## పాత్రలు

| పాత్రలు | పాత్రధారులు |
|---|---|
| 1. జ్యోతిరావు పూలే | **యన్‌జె. విద్యాసాగర్** |
| 2. సావిత్రీబాయి పూలే | **సురభి ప్రభావతి** |
| 3. గోవింద్‌రావు పూలే | **రమేష్ హజారీ / చిలకరాజు** |
| 4. దగడాబాయి | **చల్లా శ్రీలక్ష్మి** |
| 5. మాంగ్ కోండిబా | **పి. విజయకుమార్ కొయ్యలగూడెం** |
| 6. మంగలి మార్తాండ్ | **వెంకన్న, సబ్బండ** |
| 7. రామయ్య వెంకయ్య | **బమ్మిడి జగదీశ్వరరావు** |
| 8. బళ్ళాచార్య | **శ్రీశైల్ రెడ్డి పంజుగుల** |
| 9. పాటిల్ | **వేనేపల్లి పాండురంగారావు / శ్యామ్** |
| 10. రోడే | **ఎ. శ్రీనివాసులు @ మునికిష్న** |
| 11. ధోండీరామ్ | **టిహెచ్. విజయబాబు** |
| 12. భాలేకర్ | **సత్యం** |
| 13. లోఖండే | **బాగిలి సత్యం** |
| 14. బరోడా మహారాజు | **కేపస్వీ** |
| 15. కులకర్ణి | **కబీర్** |
| 16. ఆర్య భట్టు | **తెనాలి శేషుకుమార్** |
| సమర్పణ | **దస్య థియేటర్** |
| దర్శకత్వం | **సొదా అరుణ** |

ఈ నాటకాన్ని ధన్య థియేటర్ హైదరాబాద్ వారు వివిధ చోట్ల ప్రదర్శించారు.

# మహాత్మా జోతిరావు పూలే

## (నాటకం)

(ఇంకా తెర లేవలేదు)

**వ్యాఖ్యానం :** అది అంధయుగం. అణగారిన కులాల్లో చీకటి యుగం. ఆనాడు అంటరాని కులాల పరిస్థితి మూతికి ముంత నడ్డికి చీపురు. ఎందుకంటే వాళ్ల నోటి నుండి వచ్చిన ఉమ్మి నేల మీద పడకూడదు. వాళ్లు నడిచిన అడుగులు నేలమీద కనపడకూడదు.

ఈ అంధయుగ నేపథ్యంలో మహారాష్ట్ర పీష్వాల ఏలుబడిలో ఉంది. అధికారమంతా వీళ్లదే. వీరి భావజాలమే రాజ్యాంగం. బ్రిటిష్ వాళ్ల పాలన సాగుతున్నా అణగారిన కులాలపై వీరిదే ఆధిపత్యం. అప్పటి భారతదేశంలో అణగారిన వారి జీవితం ఎలా ఉందో కోండిబా–దగడాబాయి అనే చర్మకారుల ఇంటికెళ్లి చూద్దాం.

-LIGHTS ON -

## సన్నివేశం–1

(అది కోండిబా ఇల్లు – అతని భార్య దగడాబాయి.
ఆమె ప్రవేశించింది.)

**దగడ** : ఇవి కొత్త చెప్పులు – ఈ రోజు తీసుకెళ్ళాల్సినవి – ఇదొక మూట – ఇవ్వింకా కుట్టాల్సినవి – రేపటికి సిద్ధం చెయ్యాలి – ఇదొక మూట. ఇవేమో శుభ్రం చేసేసిన తోళ్లు – వీటన్నటిని ఒక మూట గట్టాలి. (మూట గట్టబోయింది – వాటిలో తాళపత్రాల కట్టను చూసి పామును చూసినట్టు భయపడింది) – అమ్మో – ఇది వీటిలో కెట్టా వచ్చింది. బాపనయ్యోళ్లు చదువుకునే పుస్తకం – కొంపదీసి... బాబ్యాగాడు ఎక్కడనుండో తెచ్చి ఇక్కడ దాచాడా? ఏమో అనుకున్నా! వాడూ! అమ్మా నేను చదువుకుంటానని రోజూ సతాయిస్తుంటే ఏదోలే అనుకున్నా! ఆడంతదాకా వచ్చినాడన్నమాట. కొడుకా! మనం చదువుకో కూడదు. మూతికి ముంతా! మెడలో గంటా నడ్డికి చీపురు కట్టుకొని ఊరికి దూరంగా ఉండాలిగానీ, ఊర్లోని పెద్ద మనుషుల దగ్గరకు పోకూడదురా

అని ఎంత జెప్పినా అర్థంకాదు. ఇప్పుడెంత పన్జేసాడు సరస్వతీదేవిని, చెప్పుల కుట్టే తోళ్ల మధ్య, పెట్టేడు. ఎంత పాపం! జొస్లే ఇంకెక్కడ దాస్తాడు చెప్పులుకుట్టే చర్మకార్ల ఇంట్లో తోల్లు గాకుండా వ్యాస పీఠాలుంటాయా! ఊర్లో అన్ని ఇళ్ళల్లో తిరుగుతున్నాయి పక్షులు. అన్ని ఇళ్ళల్లో తిరుగుతున్నాయి కుక్కలు, పిల్లులు. మనం మాత్రం ఎందుకు తిరగ్గాడదు అని నన్ను రోజూ అడుగుతాడు బాబ్యా! నేనేమని జెప్పేదివాడికి. అయ్యా! ఇది వామనుడేలుతున్న రాజ్యం! ఇంకా మన బలి చక్రవర్తి రాజ్యం రాలేదు. మన బతుకులు పిల్లులు, కుక్కల కన్నా హీనమయ్యా!

అందుకని వామనుడి వారసులతో మన బలిజనం కలిసి తిరగ్గాడదని చెబితే వాడికర్థం కావడం లేదే! బాబ్యా నా ఒక్కగానొక్క కొడుకు. ఎర్రిబాగుల కొడుకు. అమ్మా! మనం బలి చక్రవర్తి వారసులం కదా! నేను బలి చక్రవర్తినవుతానమ్మా! వామనుల వారసుల్ని జయిస్తానమ్మా అని పెద్ద పెద్ద మాటలు శెబుతాడు నా చిన్నారి బాబ్యా!

చిన్న కత్తికి పెద్ద కత్తికి తేడా తెలీదు వాడికి. పనికత్తి చేతబట్టి చర్మాన్ని అచ్చులుగా కొయ్యలేడు. గుర్తుగా గూడకట్టలేడు. ముంగూటం తిప్పలేడు. ఆరెతో దారం లాగి గూటంతో దెబ్బ వెయ్యలేడు. చిన్న వయసు. పెద్దయ్యాక బలిచక్రవర్తి నవుతానంటాడు నా బాబ్యా! బలి చక్రవర్తి కాకపోతే పోనీ ఆ బ్రాహ్మణ భట్టుల చేతిలో బలి కాకుండా ఉంటే అంతే చాలు.

ఇప్పుడీ తాటాకుల కట్ట ఎక్కడ నుండి దొంగిలించాడు. దీని గురించి ఆ బాపనయ్యోల్లకి తెలీకముందే దీన్ని ఏదో ఒక విధంగా వాళ్లకి అప్పగించెయ్యాల. అప్పుడు గానీ నా ప్రాణాలు కుదుటపడవు. (అని తాళ పత్రాలను బయటకు తీసింది. ఆ తాటాకుల మీద కుంకుమ కనిపించింది) ఆహా! కుంకుమ! ముత్తయిదువులు పెట్టుకునే కుంకుమ. పెద్ద కులపు ఆడోళ్లంతా పెట్టుకునే ఎర్రటి కుంకుమ. కానీ ఈ కుంకాన్ని మేము మాత్రం పెట్టుకోకూడదు. కనీసం ముట్టుకోకూడదు. ఈ కుంకుమ బొట్టు పెట్టుకుందని గంగాబాయి చూపుడువేలు తీసేసారు కదా పంచాయితీ పెద్దలు - మేము పసుపుబొట్టు మాత్రమే పెట్టుకోవాలి. మాకెవ్వరూ కుంకుమ అమ్మకూడదు. అమ్మిన వారిని వెలివేస్తారు. కుంకుమ పెట్టుకుంటే చూపుడు వేలు తీసేస్తారు. కానీ ఎర్రటి కుంకుమ

బొట్టు నొసటిమీద ఉంటే ఎంత దర్జా. ఒక్కతూరి... ఒక్కతూరి అంటే ఒక్కతూరి ఈ కుంకుమ నా నొసటిన దిద్దుకుంటాను. (అని ముంతలో నున్న నీటిలో ముఖాన్ని చూసుకుంటూ కుంకుమబొట్టు దిద్దుకుంటుంది) అబ్బా! కుంకుమబొట్టు పెట్టుకుంటే ఇంత అందం వస్తుందా! ఎంత అందంగా ఉన్నావే దగడాబాయి! (అని మురిసిపోతుండగా కోండిబా అరుచుకుంటూ ప్రవేశిస్తాడు)

**కోండిబా** : యేయ్ దగడా!

**దగడాబాయి** : (మూడు మూటలూ కంగారుగా కలిపేసి మూటకడుతుంది. పరిగెత్తుకుంటు వచ్చి కోండిబా ముంతా, తాటాకూ విప్పుతుంది)

**కోండిబా** : యేంటే దగడా కొత్త చెప్పులూ, కుట్టాల్సిన చెప్పులూ, తోళ్లూ అన్నీ కలిపి మూట కట్టేస్తున్నావ్? కొత్త చెప్పులు తీసి ఇక్కడబెట్టు.... తీసుకెళ్లాల.

**దగడ** : తీసుకెల్దువులే ముందు కొంచెం అంబలి తాగు.

**కోండిబా** : తాగుతాలేగానీ ముందు నీళ్లియ్యవే... నోరు ఎండిపోయింది.

**దగడ** : (ముంతతో నీళ్లు ఇచ్చింది)

**కోండిబా** : (ముంతనీళ్లలో దగడాబాయి నీడచూసి) ఏదీ ఇటురా!

**దగడ** : (దగ్గరగా వచ్చింది)

**కోండిబా** : కొంచెం వంగు

**దగడ** : (ముంతమీదికి వంగింది)

**కోండిబా** : యెంత బాగున్నావే దగడా, ఈ ముంతలో యేం మహత్యం వుందోగానీ నువ్వు పెట్టుకున్న పసుపుబొట్టు యెర్రగా కుంకంలా మెరిసిపోతుందే చూడు... చూడు... యెంత బాగున్నావో... గ్రామ దేవతలాగా.

**దగడ** : నేను ఎర్రటి కుంకుం బొట్టు పెట్టుకుంటే నీకు యింత యిష్టమా? అయితే రోజూ పెట్టుకుంటాలే.

**కోండిబా** : ఆ! నిజంగానే కుంకం పెట్టుకున్నావా? యెంతకి తెగించావే? నేను ముంతలో మహత్యం అనుకున్నా. వోసినీ... యెంత పని చేశావు? కుంకం యెక్కడిదే నీకు? యెవరికైనా తెలిసిందంటే మన కొంపకు అగ్గెట్టేస్తారే దగడమ్మా. నిప్పులాంటి మనిషిని నేను. నిప్పుల్లో తొయ్యద్దే.

యే రోజూ నడ్డికి చీపురూ మూతికి ముంతా లేకుండా బయటికి పోలా. యిప్పుడు మన మాంగ్ జాతికే మచ్చ తెచ్చావు గదే. యెక్కడ దొంగిలించావే ఆ కుంకం?

**దగడ** : నేనేం దొంగిలించలేదు కుంకుం. నేనేం నీతి తక్కువదాన్ని కాదు. కాకి యెత్తుకు వచ్చింది యెక్కడనుంచో. కాకి ఈక ఒకటి రాలింది మన యింటి ముందు. ఆ ఈకకి అంటుకుని వుంది ఈ కుంకుం. అది పెట్టుకున్నా. నువ్వు చూసి సంతోషించాలని పెట్టుకున్నా, యింట్లోనే గదయ్యా... నువ్వు తప్ప యింకవ్వరూ చూడరు గదా. నువ్వు తీసెయ్యమంటే తీసేస్తా.

**కోండిబా** : నువ్వు ఎర్రబొట్టు పెట్టుకున్నట్టు ముంతలో కనబడితే మురిసి ముక్కలవుతా గాని, నిజంగానే పెట్టుకుంటే నా గుండె దడదడలాడి పోతుందే. ఊళ్లో ఎవరు చూసినా నీ వేలు తీసేస్తారే, చెరిపెయ్!

**దగడ** : (యేడుస్తున్నది)

**కోండిబా** : (అరుస్తూ) పెట్టుకో పసుపు! (దగడాబాయి లోపలికి వెళ్లింది, దగడాబాయి అటువెళ్లగానే కోండిబా మూట దగ్గరికి వెళ్లాడు. ఇంటి మధ్యకి తెచ్చాడు. విప్పబోతూ వుండగా)

**దగడ** : (పరిగెత్తుకుంటూ వచ్చింది పసుపు బొట్టుతో) యేం కావాలయ్యా? నేను తీసిస్తాగదా. యిటు చూడు. యిటు చూడు. పసుపుబొట్టు బాగుందా?

**కోండిబా** : పరుగు పరుగున వచ్చావు. ఈ మూటా మీద చెయ్యేస్తేనే అంత తత్తరపడుతున్నావు. యేముందే ఈ మూటలో?

**దగడ** : మూటలో యేముంటాయ్ అయ్యా? అది చెప్పుల మూట. చెప్పులుంటాయ్. చెప్పులు కుట్టే తోళ్లుంటాయ్. యింకేముంటాయ్?

**కోండిబా** : అయితే నేను విప్పుతా

**దగడ** : నేను విప్పుతా (మూట విప్పి పైనున్న కట్టలోపలికి దాస్తుంది)

**కోండిబా** : (గమనించి మూట చెల్లాచెదురు చేస్తాడు)

**దగడ** : యేముందని వెతుకుతున్నావు? నీ జిమ్మడ. నీ అబ్బ సంపాదించిన ముల్లెవుందని వెతుకుతున్నావా?

**కోండిబా** : (మూట మొత్తం పైకెత్తి విదిలించాడు. దాంట్లో నుంచి తాళపత్రాల కట్ట బయటపడింది. పామును చూసినట్టు భయపడిపోయాడు) యేందే యిది పాతకురాలా? నువ్వూ నీ కొడుకూ కలిసి నన్ను నిలువునా కొర తేయించడానికి పూనుకున్నారే. లేకపోతే యేందే తాటాకుల కట్ట? మనింట్లోకి యెట్టా వొచ్చిందే ఈ పుస్తకం? ఈ చెప్పుల మూటలో యెన్నాళ్ల నుంచి దాస్తున్నారే మీ అమ్మా కొడుకులు? నీ కుంకుం బొట్టు చూసినప్పుడే సగం చచ్చాను. యిప్పుడు పూర్తిగా చచ్చిపోయాను. దీన్ని మనింట్లో చూస్తే మనల్ని బతకనిస్తారా? యిదిగో దీని మీద వున్న కుంకుం బొట్టు. యిదే కదా నువ్వు పెట్టుకుంది! యెంతకి తెగించావ్? యెక్కడ? వాడెక్కడ? ఆ బాబ్యాగాడెక్కడ? ఈ రోజు కులకర్ణిగారికి చెప్పులిచ్చిరావాలని తెలియదా? యెక్కడవాడు?

**దగడ** : చదువు నేర్చుకుంటానన్నాడయ్యా, యెక్కడికెళ్లాడో తెలియదు.

**కోండిబా** : మూతికి ముంతా నడ్డికి చీపురూ కట్టుకుని చదువు నేర్చుకోడానికి వెళ్లాడావాడు. అంత పన్జేసాడా వాడు. ఏమౌతాడో! ఏవిచెయ్యాల్రా భగవంతుడా! (ఇంతలో బయట గందరగోళం... అరుపులు... కేకలు...) (వొరే కోండిబా.. నీ కొడుకుని చంపేశార్రోయ్... నీ కడుపు కాల్చేశార్రోయ్... వొసే దగడాబాయి నీ కొడుకు చెవుల్లో సీసం పోసి చంపేశారే... బాబ్యా సచ్చిపోయాడే...)

**దగడ** : అయ్యో... బాబ్యా... కొడుకా..బాబ్యా... ఎంతపన్జేసుర్రా అయ్యా

**కోండిబా** : ఎంత పన్జెరిగింది... నేనెల్తా నుండు (బయటకు వెళ్లబోయాడు)

**దగడ** : అయ్యో (ముంత చీపురు అందుకుని) యివి మరిచిపోయావేందయ్యా... నిన్ను కూడా చంపేస్తారయ్యా... (గబగబా ముంత, చీపురు కట్టింది)... యిదిగో వస్తున్నా... అయ్యా..... నా చిన్నారి బాబ్యా.... నేను కూడా నీ దగ్గరికే వస్తున్నానయ్యా.

-LIGHTS ON -

**వ్యాఖ్యానం2 :** ఇటువంటి సామాజిక నేపథ్యంలో మహారాష్ట్రలో పూణె నగరంలో 1827 సంవత్సరములో ఏప్రియల్ 11వ తేదీన జన్మించారు మహాత్మా జ్యోతిరావుపూలే. ఊరికీ, ఉనికికీ, వెలుగుకి, వెలుతురికీ దూరంగా నెట్టివేయబడిన దళితులకు, సంపదల్ని సృష్టించడమేగానీ అనుభవించలేని

శూద్రులకు, ఈ జనాభాలో సగభాగమున్న స్త్రీలకు – ఓ జీవనజ్యోతిగా వెలుగు ప్రసాదించాడు జ్యోతిబాఫూలే. తన భావాలతో సారూప్యం గల ఇద్దరు బ్రాహ్మణ మిత్రులుండేవారు. వారు సదాశివ బల్లవగోవాండే, మోరో విఠాల్ విల్వేకర్. ఒకనాడు తన బ్రాహ్మణ మిత్రుని పెళ్లికి వెళ్లి ఊరేగింపులో పాల్గొన్నాడు. అప్పటికి అతని వయసు 21 సంవత్సరాలు.

-LIGHTS ON -

## సన్నివేశం-2

బాజా భజంత్రీలతో పెళ్ళి ఊరేగింపు వెళుతోంది.

(ధోండీరామ్, రోడే ప్రవేశిస్తారు)

**ధోండీరామ్ :** వొరే రోడే, ఆ వూరేగింపు ఎవరిదో తెలుసురా?

**రోడే :** ఎవరైనా తెల్లదొర వస్తున్నాడేమోరా!

**ధోండీరామ్ :** తెల్లదొర కాదురా! మన దొరే. కాకా శంభాల్కర్ దొరగారి అబ్బాయి పెళ్ళి. పెళ్ళికొడుకు వూరేగింపుగా వెళుతున్నాడు. (భట్టు ప్రవేశిస్తాడు)

**భట్టు :** వొరే ధోండీరామ్ ఎవర్నిరా దొర అంటున్నావు? తెల్లదొర ఎవరికి దొరరా? మీకా మాకా?

**ధోండీరామ్ :** మాకు కాదు దొరా, మీకే.

**కులకర్ణి :** సరిగ్గా చెప్పావురా! మరి మీకు దొర ఎవ్రా?

**ధోండీరామ్ :** అదేంటి దొరా! అంతమాట అన్నారు? మీరే కదా మా జాతికి అంతా దొరలు!

**కులకర్ణి :** మమ్మల్ని దాటిపోయి తెల్లదొరల దగ్గరకి వెళ్లిపోదామనుకుంటున్నారేమో! తాట తీస్తాం.

**భట్టు :** కరగించిన సీసం పోస్తాం.

**ధోండీరామ్ :** ఎంతమాట దొరా! దొరలైనా, మహాత్ములైనా మీరే మాకు దిక్కు. మీకు పైన తెల్లదొరలు.

**కులకర్ణి :** యెవడ్రా వాడు? శంభాల్కర్ గారి అబ్బాయి పక్కన! వాడి వాటంచూస్తే శూద్రునిలా ఉన్నాడు. యెంత ఘోరం? ఒక శూద్రుడు బ్రాహ్మణులతో సరిసమానంగా భుజం రాసుకుంటూ నడుస్తాడా? మా బ్రాహ్మణ జాతి

మొత్తం మైలపడిపోయింది. పెళ్లి వూరేగింపు అంతా నాశనమైపోయింది. లాగండి వాణ్ణి. ఈడ్చుకురండి వాణ్ణి. ఆపండ్రా వూరేగింపు! (ధోండీరామ్, రోడే పరుగెత్తారు. ఫూలేను లాక్కొచ్చారు.)

**భట్టు** : యెంత కండకావరంరా నీకు? తియ్యరా తలపాగా. బ్రాహ్మణుల పక్కన నడిచేంత అహంకారం తలకెక్కిందా నీకు? తక్కువ జాతి వాడికి ఎక్కువ పొగరు పనికిరాదు. తియ్యరా తలపాగా.

**రోడే** : (తలపాగా లాగేస్తాడు)

**కులకర్ణి** : అబ్బో! మాలీ కులస్తుడివి కదా నువ్వు? గోవిందరావు కొడుకు కదా నువ్వు? ఈ వేషమేమిట్రా? పందికి పట్టు వస్త్రాలు కట్టినట్టు? బ్రాహ్మణుడిలా తెల్లటి బట్టలు తొడుక్కున్నంత మాత్రాన బ్రాహ్మణుడి స్థాయిలో దర్పం వెలిగిద్దామనుకుంటున్నావా?

**భట్టు** : చింపరా చొక్కా. (రోడే చొక్కా చింపాడు) (పెళ్లికొడుకు వాళ్ల మధ్యకొచ్చాడు)

**పెళ్లికొడుకు** : బాబాయ్. ఆగండి. అతను నా ఆహ్వానం మీద వచ్చాడు. అతన్ని అవమానించకండి. అతను బాగా చదువుకున్నవాడు. మన గోపాల్ హరదేశ్‌ముఖ్ అంతటి పండితుడు.

**భట్టు** : చదివితే... చదివితే శూద్రపు వెధవ బ్రాహ్మణుడవుతాడా? మన గోపాల హరదేశ్‌ముఖ్ చదవకపోయినా గొప్పవాడురా. చదివినంత మాత్రాన శూద్రుడు బ్రాహ్మణుడు అవుతాడా? మహాత్ముడు కాగలడా?

**కులకర్ణి** : గంగలో ముంచినంత మాత్రాన కుక్క కామధేనువు అవుతుందా? నువ్వు నోర్మూసుకుని వుండు. నడువ్! నువ్విక్కడినుండి నడువ్!

**పెళ్లికొడుకు** : బాబాయ్ నలుగురు కలిసి ఆనందంగా జరుపుకునే పెళ్లి వేడుకలో కులాల ప్రస్తావన తీసుకురావడం మీ వంటి వారికి తగదు. భగవంతుని సృష్టిలో అందరూ సమానమే.

**భట్టు** : అయితే వెళ్ళి ఆ భగవంతుడితోనే కలిసి తిరుగు. నీ పెళ్లిని యిప్పుడే యిక్కడే ఆపేస్తాం. నేను ఈ పూణె నగరంలో బ్రాహ్మణ సమాజాన్ని శాసించే ఆర్యభట్టును. మాలీ కులస్తుడి ప్రవేశంతో మైల పడిపోయిందని నీ పెళ్లిని చెల్లకుండా చేస్తాం. నీ వంశానికి నువ్వు మాయని మచ్చగా మిగిలిపోతావు. ఛీ! ఛీ!

**కులకర్ణి** : ఆరడుగులు ఏడ్చాడు వెధవ! ఛీ! ఛీ! (ఇద్దరూ కూడబలుక్కోవడానికి దూరంగా వెళ్లిపోయారు)

**పెళ్లికొడుకు** : I am very sorry Phule - Kindly understand my position - I am very sorry my friend.

**పూలే** : Its all right Shambalkar. I can understand. You and me both are the victims of the caste system. But there is a basic difference between us. In this system you are previleged and I am oppressed. Take it easy. People are waiting for you. Go ahead. Happy married life Shambalkar.

(భట్టు, కులకర్ణి మళ్లీ వచ్చారు)

**భట్టు** : ఒరేయ్! ఇంకా చూస్తూ నిలబడ్డారేమీ! వాడ్ని అవతలకు త్రోసిపారెయ్యకుండా.

**కులకర్ణి** : ఒరేయ్ ధోండిమ్, రోడేయ్! చెప్పండి మీ కర్రలకు పన్జెప్పండి – మీరు వాయించండి భజంత్రీలు –

**భట్టు** : నువ్వు పదరా పెళ్లికొడుకా! (భట్టు, కులకర్ణి పెళ్లికొడుకుని తీసుకొని వెళ్లిపోయారు) (ధోండీరామ్, రోడే పూలే మీద పడి క్రిందకు త్రోసి వెళ్లిపోయారు) పూలే ఒంటరిగా మిగిలిపోయాడు.

**పూలే** : (ఆలోచిస్తూ తనలో తానే మాట్లాడుకుంటున్నాడు) ఫర్వాలేదు. బట్టలు పెద్దగా చిరగలేదు. కానీ ఇక్కడే చాలా బాధగా ఉంది. ఇప్పటివరకు వీళ్లంతా నా స్నేహితులనుకొని మైమరిచి ప్రవర్తించాను. కానీ ఇప్పుడర్థమైంది నా స్థానమేంటో. ఇదిరా నీ స్థానమని నాకు తెలియజేసారు. నేను శారీరకంగా బలవంతుడ్ని. పాండిత్యంలో కూడా పూనా నగరంలో ఉన్న ఏ బ్రాహ్మణుడు నాకు సాటిరాడు. నేను బ్రాహ్మణుడైన గోపాల హరదేశ్‌ముఖ్ కంటే ఫస్ట్‌క్లాస్ స్టూడెంటుని. I am the only person who have guts to argue with the British Governor of Maharashtra with fluency in Victorian style of English - నేను కర్ర పట్టుకొని నా గురువు బహుజీ మాంగ్‌ని తల్చుకొని పొలికేక పెడితే నాకు ఎదురు నిలిచే వాడున్నాడా? నిన్నగాక మొన్న బ్రాహ్మణభట్టుల్ని తిట్టారని, భారతదేశాన్ని అవమానించారని ఇద్దరు బ్రిటిష్ అధికారుల్ని చెరకు గడలతో తరిమి, తరిమి కొట్టాను. కానీ అదే బ్రాహ్మణులు నన్ను అవమానిస్తుంటే ఎందుకు తిరిగి కొట్టలేకపోయాను. నన్నాపింది ఎవరు?

నా చేతులు కట్టిపడేసింది ఎవరు? కులం! కులం! కులం! వాడిది అగ్రకులం! నాది తక్కువ కులం! మాలీకులం. నా కులం పట్ల అగౌరవం నాకూ ఉందా! వాడు నాకన్న అధికుడనే భావం నా మనసులోనూ ఉందా? ఉంది. అదే లేకపోతే నేను వాడ్ని తిరిగి కొట్టేవాడ్ని. నా మాలీకులమే నన్ను ఆపకపోతే నేను వాడ్ని కొట్టేవాడ్ని.

(కోండిబా హేళనగా నవ్వుతూ వచ్చాడు)

**కోండిబా** : శంబాల్కర్ గారి పెళ్లికొచ్చారు. బ్రాహ్మణభట్టుల పెళ్లికొచ్చారు మాలీ దొరగారు. నేనెల్తానా? నన్ను పిలిస్తే నేనా పెళ్లికెళ్తానా? ఎళ్లను గాక ఎళ్లను. నీకు తెల్సుకదా! నీలాగే నా కొడుకు తప్పుజేసాడు. కులం కట్టు కాదని సదువుకున్నాడు. ఏమయ్యింది సంపేసారు. సీసం పోసి మరీ సంపేసారు. తప్పుజేత్తే సంపీయ్యకంట ముద్దెట్టుకుంటారేంటి? కులం కట్టుబాటుని కాదనడం తప్పు. ఆ తప్పు నా కొడుకు చేసాడు. నువ్వూ చేసావు. నువు తప్పు చేసావు. (నవ్వుతున్నాడు)

**ఫూలే** : ఒరేయ్ కోండిబా! ఎలా నవ్వగలుగుతున్నావురా! మెడలో ముంత, నడ్డికి చీపురు కట్టుకొని ఎలా నవ్వగలుగుతున్నావు. నీ వేషం నీకు అవమానంగా అనిపించడం లేదురా! ఒరేయ్ నీ ముంత తీసేస్తాను... నీ చీపురు విప్పేస్తాను.

**కోండిబా** : (తప్పించుకుంటూ) నిన్ను ముట్టుకోనిస్తానా! ఆ! దొరా! నువ్వు తప్పుజేసావు. కులం కట్టుబాటుని కాదన్నావు... నువు తప్పు జేసావు. అందుకే నీకు పెళ్లి జేసారు... పెళ్లి జేసారు. (నవ్వుకుంటూ వెళ్లిపోయాడు)

**ఫూలే** : ఒరేయ్! ఒరేయ్! (వాడ్ని పట్టుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యాడు) నాకు జరిగిన అవమానం జూసి నా వాళ్లే నా ముఖం మీద ఎలా నవ్వగలుగుతున్నారు. వాళ్లకు, నాకు ఉన్న తేడా ఏమిటి? వాల్లు చదువుకోలేదు. నేను చదువుకున్నాను. చదువు ఆలోచనను రేకెత్తిస్తుంది. చదువొక్కటే ఏది అవమానమో, ఏది గౌరవమో తెలియజేస్తుంది. అందుకే నా వాళ్ళంతా చదువుకోవాలి. ఈ అనాగరికత నుండి, పేదరికం నుండి, భావదాస్యం నుండి అణగారిన బిడ్డలందర్నీ విద్యావంతుల్ని చెయ్యాలి. ఈ విద్యావ్యాప్తికి అవసరమైన పునాదుల్ని ఇప్పుడే వేస్తాను. ఇప్పుడే నా స్వంత బడి ప్రారంభిస్తాను. If not here then where ఇక్కడకాకపోతే ఇంకెక్కడ? If not now then when, ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు If not me then

who నేను కాకపోతే ఇంకెవరు. Yes it is me only, its me only. బ్రిటిష్ వాళ్లకు కులం లేదు. అందుకే కొట్టేశాను. కానీ బ్రాహ్మణభట్టులకు కులముంది. అందుకే కొట్టలేకపోయాను. బ్రిటిష్ వాళ్లను కొట్టినంత సులువు కాదు అగ్రవర్ణాల వారిని కొట్టడం. అందుకే నా ప్రథమ శత్రువు బ్రిటిష్ వాడు కాదు, కుల వ్యవస్థ. దాన్ని ఎదిరించాలి. నాకు అంత ధైర్యం ఉందా! ఉంది! కొందరికి దూరమౌతానేమో. కావాలి. తప్పదు. One cannot discover new oceans unless he has the courage to lose sight of the shore.

-LIGHTS OFF -

**వ్యాఖ్యానం3 :** అగ్రవర్ణాలకు సమాజం స్వంత ఇల్లు లాంటిది. వాళ్లు ఎక్కడైనా ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించగలరు. కానీ అణగారిన వాళ్లకు ఇల్లు కూడా సమాజమే. అక్కడ కూడా పోరాడాల్సిందే. సమాజంలో ఎంత పోరాడాలో ఇంట్లో కూడా అంతే పోరాడాలి. జ్యోతిరావుపూలే ఇంట్లో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్నాడు.

-LIGHTS ON -

## సన్నివేశం-3

పూలే ఇల్లు – (కుర్చీలో కూర్చొని గోవిందరావు చుట్ట చుట్టుకుంటూ మాట్లాడుతున్నాడు – ఎదురుగా కోడలు సావిత్రీ బాయి పూలే)

**గోవింద** : వాడ్ని నువ్వేమీ అడగవా? వాడేమి చేస్తున్నా గుడ్లప్పగించి చూస్తుంటావా?

**సావిత్రి** : ఏవిటి మామయ్యా!

**గోవింద** : ఏవిటా????.... మన తాహతూ, పరిస్థితి ఆలోచించుకొని ప్రవర్తించాలి. పీష్వాలు మన పూర్వీకుల మీద దయదల్చి ఆ మాత్రం భూమి ఇవ్వడం వలన, ఇదిగో, ఇలా గౌరవంగా బ్రతుకుతున్నాం. మూడు పూటలు నాలుగు వేళ్లు నోట్లోకి వెల్తున్నాయి. అంతమాత్రం చేత మన మేదో సమాజాన్ని ఉద్ధరించేస్తామని భ్రమపడకూడదు.

**సావిత్రి** : మీరు దేని గురించి మాట్లాడుతున్నారు.

**గోవింద** : ఇదిగో ఇదే నాకిష్టముండదు. వాడూ ఆ మహర్లని, మాంగుల్ని ఇంట్లోకి తీసుకొస్తుంటే, నువు కాఫీలు, టిఫిన్లు ఇవ్వడం నేను

చూడలేదనుకుంటున్నావా? వాళ్లకు వాడు తిండిగింజలు సంతర్పణ చేస్తుంటే, నువు పాత బట్టలు పెట్టడం నా కళ్లబడలేదనుకుంటున్నావా.

**సావిత్రి** : వాళ్లంతా బీదవాళ్లని....

**గోవింద** : బీద వాళ్ళైనంత మాత్రాన... వాళ్ళను ఇంట్లోకి రానిస్తావా? ఇంట్లోదంతా దోచి పెడతావా!... అదేదో ఓ బీద బ్రాహ్మణునికిచ్చి అతని కాళ్లకు నమస్కారం చేస్తే ఇంత పుణ్యమొస్తుంది. వీళ్లకిస్తే ఏమొస్తుంది? వాళ్ల దరిద్రం మనకంటుకుంటుంది. (సావిత్రి మౌనం) మీ యింటి కోసం ఖండాలా తాలూకా అంతా వెతుక్కుంటూ వచ్చాను. జగదేవ్‌పాటిల్ కుటుంబంలో అడుగుబెట్టాను. నువ్వు మా ఇంట్లో కోడలిగా అడుగుపెట్టావు. మంచి పిల్లవని, వీణ్ణి దారిలో పెడతావని వెతికి వెతికి తెచ్చి వీడికి కట్టబెట్టాను. అరే! కొమ్మకి కొమ్మ అంటుగట్టినట్టు అయిపోయారే మీ యిద్దరు. వాడిలాగే తయారయ్యావే నువ్వు! వీడు పుట్టిన సంవత్సరానికే తల్లిపోయింది. నేను మళ్లీ పెళ్లి చేసుకోలేదు యెందుకు? వీడి భవిష్యత్తు కోసం. వొకటి గాదు, రెండు గాదు, మూడుసార్లు వీణ్ణి బడి మానిపించాను. యెందుకు? వీడి భవిష్యత్తు కోసం.

**సావిత్రి** : సర్లెండి మామయ్య, నేనతనితో మాట్లాడుతాను.

**గోవింద** : మాట్లాడడంకాదు. కట్టడి చెయ్. పొలంలో పనిలేకపోతే ఇంట్లో పడి ఉండమను. అంతేగానీ మాంగుల వాడల్లోకి, మహార్లు వీధుల్లోకి వెళ్లొద్దని చెప్పు. అది అంత మంచిది కాదు (లోనకు వెళ్లాడు. బయటనుండి పూలే వచ్చాడు) (పూలే చాలా దీర్ఘాలోచనలో ఉన్నాడు. పెళ్లిలో జరిగిన పరాభవమే గుర్తొస్తుంది. అవే మాటలు మళ్లీ, మళ్లీ అతని చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి)

**సావిత్రి** : ఏవిటండీ అలా ఉన్నారు. పెళ్లికి వెళ్లలేదా సేఠ్‌జీ!

**పూలే** : వెళ్లాను. కానీ గెంటేశారు. శూద్రుడనని, బ్రాహ్మణులతో కలిసి నడిచే అర్హత లేదని నన్ను పెళ్ళి ఊరేగింపు నుండి గెంటేశారు.

**గోవింద** : (లోనుండి వస్తూ) చాలా మంచి పని చేసారు. అదే పీష్వాల కాలంలో అయితే ఉరి తీసేవారు.

**పూలే** : ఉరితీసేవారా! నేనేమి తప్పు చేసానని.

**గోవింద** : నువ్వు చేసింది తప్పే. శూద్రులకు బ్రాహ్మణులతో సరిగా మనం నడిచే అర్హత లేదు.

**పూలే** : ఎందుకు లేదు.

**గోవింద** : ఎందుకంటే బ్రాహ్మణుడు సరస్వతీ పుత్రుడు.

**పూలే** : శూద్రుడు శ్రమ స్వరూపుడు.

**గోవింద** : బ్రాహ్మణుడు పరిశుద్ధుడు.

**పూలే** : శూద్రుడు తాత్విక విశుద్ధుడు.

**గోవింద** : బ్రాహ్మణుడు ఈ లోకానికి జ్ఞానదాత.

**పూలే** : శూద్రుడు ఈ ప్రపంచానికి ప్రాణదాత.

**గోవింద** : బ్రాహ్మణుడు ఆ దేవునికి బదులుగా ఈ భూమి కొచ్చిన భూసురుడు.

**పూలే** : ఈ భూమండలం మీద బ్రహ్మతత్వాన్ని, మానవ అమరత్వాన్ని నింపుతున్న సిద్ధుడు శూద్రుడు. మన్నును అన్నంగా మార్చుతున్న నిష్కామ కర్మయోగి శూద్రుడు. హలాన్నే కలంగా చేసుకొని భూములపై సేద్యమనే మహాకావ్యాన్ని రాసే ఆదికవి శూద్రుడు. శూద్రుల్ని మనుష్యులుగా గుర్తించేటట్టు చెయ్యాలి.

**గోవింద** : పిచ్చివాడా!.... తిరుగుబాటు చేసి బ్రిటిష్ ప్రభుత్వాన్నయినా తరిమికొట్టగలమేమో గానీ – ఎన్ని విప్లవాలు లేవదీసినా ఎన్ని ప్రయత్నాలు చేసినా అగ్రకులాల ఆధిపత్యాన్ని మాత్రం ఎదిరించలేం... అయినా! మనం ఇలాగే బతకాలని ఆ దేవుడు మన మొహాన రాసినపుడు మనం మాత్రం ఏం చెయ్యగలంరా.

**పూలే** : నీ నరనరాల్లో జీర్ణించుకుపోయిన బానిసత్వ లక్షణాలు నీతో ఇలా మాట్లాడిస్తున్నాయి... కానీ వాస్తవం అది కాదు నాన్నా... కావాలంటే చూడు. (అంటూ గబగబా టేబుల్ మీద వున్న రెండు పుస్తకాలు తీసి చూపించాడు) చూడండి నాన్నా ఈ పుస్తకాలు. ఇది థామస్ పెయిన్ రాసిన "మానవ హక్కులు", ఇది "ఆన్ లిబర్టీ" అని జె.ఎస్.మిల్ రాసాడు. మానవులంతా సమానమని రాసారు. ఇవి చదివితే అగ్రవర్ణాలమని చెప్పుకుంటున్న వాళ్లు మనలాంటి వాళ్లను మరుగుజ్జులుగా ఎలా మార్చారో, సంప్రదాయం పేరిట ఎలా ఆధిపత్యాన్ని సాధించారో తెలుస్తుంది. చదివి వినిపించనా నాన్నా!

**గోవిందరావు:** ఒరేయ్ తప్పురా! మనం చదవాల్సింది మన పుస్తకాల్ని. మనం పాటించాల్సింది మన కులం కట్టుబాట్లని. పాటించకపోతే చంపేస్తార్రా! వాళ్ళ పెళ్ళికెళ్ళి వాళ్ళతో కలిసి నడిస్తే ఊరుకుంటారా? మాలీ కులపోళ్ళ పెళ్లిళ్లకి మాంగుల్ని, మహర్లని రానిస్తామా!... కులం కట్టు పాటించాలి కదమ్మా! వీడేం చేస్తున్నాడో తెల్సా!.... నా పిచ్చిగానీ నీకు తెలీకుండా చేస్తాడా? వీడు కర్రసాము నేర్చుకుంటున్నాడు. వీడికి కర్ర సామెందుకమ్మా! వీడేమైనా పఠాన్ కొడుకా! మహారాష్ట్ర రాజావారి అల్లుడా! ఒక మాలీ నా కొడుకు! మాలీ నా కొడుకు ఏం పన్జేసుకోవాలి. పార, పలుగు పట్టుకొని పొలం పన్జేసుకోవాలి. వీడు కర్రసాము నేర్చుకొని... అసలు వీడు కర్ర సాము ఎక్కడ నేర్చుకుంటున్నాడో తెల్సా? వీడు నాకు తెలీదనుకుంటున్నాడు... వీడు కర్రసాము నేర్చుకొనేది ఒక మాంగ్ దగ్గర. వాడి పేరేంటి బహుజి మాంగ్... ఒక అంటరానివాడి దగ్గర సాము నేర్చుకొని ఆ కర్ర తెచ్చి నా ఇంట్లో పెడతావా! ఏదీ ఆ కర్రా! ఎక్కడ దాచావురా... (లోనకెళ్లి తలవ గుడ్డతో ఆ కర్రను తెచ్చి విసిరాడు)

**పూలే** : నాన్నా! నువు చెప్పిందంతా విన్న తర్వాత నేను పూర్తిగా మారిపోయాను. ఇప్పుడు నేనొక నిర్ణయానికొచ్చాను. ఒక దారి ఏర్పడింది. ఈ ప్రయాణమిక ఆగదు. నేనిప్పుడు నా ఒక్క కులానికే మాలిని కాను. అంటరాని, అణగారిన బిడ్డలందరికీ మాలిని.

**గోవిందరావు:** ఏవి చూసుకొనిరా నీకింత అహంకారం. నీ చదువు చూసుకొనా! నీ పుస్తకాలు చూసుకొనా! నీ పలకా బలపం చూసుకొనా!.... ఒరేయ్ ఈ రోజు నుండి నీ పుస్తకాలు, నీ పలకా బలపం నా ఇంట్లో ఉండటానికి వీల్లేదు. ఇప్పుడే వాటిని బయటకు విసిరేస్తా! ఏమనుకొంటున్నావో (పలక, బలపం తీసుకొచ్చాడు) ఈ పలకా, బలపం చూసుకొనే కదరా నన్నెదిరిస్తున్నావ్! వీటిని చూసుకొనే కదరా కులం గిలం కాదంటున్నావ్!.. ఇక ఇవి నా ఇంట్లో ఉండటానికి ఎంత మాత్రం వీల్లేదు. (విసిరి నేలకు కొట్టాడు) వాళ్ల జోలికెళ్తే బ్రతకనివ్వర్రా ఒరేయ్ భగవంతుడా! యింత తెలివైన వాణ్ణి మా కులంలో ఎందుకు పుట్టించావురా! మాలీ కడుపులో ఒక బ్రాహ్మణుడ్ని ఎందుకు పుట్టించావురా! వాడి ద్వారా ఈ లోకాన్ని నువు సంస్కరించాలనుకుంటే వాడ్ని ఏ రాజు కొడుకుగానో పుట్టించాల్సింది. అప్పుడందరూ వాడు చెప్పింది వినేవారు. ఎవ్వరు వాడి

మీద కత్తి గట్టే సాహసం చెయ్యకపోయేవారు. ఒరేయ్ జ్యోతి నీకు తెలీదురా! చంపేస్త్రా! మనల్ని బతకనివ్వ్రరా. చంపేస్తారురా. (లోనికి వెళ్లిపోయాడు)

**పూలే** : నాన్నా! చచ్చిపోతామనే భయమెందుకు నాన్నా! మన జాతి ఎప్పుడో చచ్చిపోయింది నాన్నా! మన జాతికేమైనా కుల గౌరవమా! అధికారమా! భూమా! ఏముందని మన జాతి బతికుందని అనుకోవాలి నాన్నా! చచ్చిన మన జాతికి నేను ఊపిరి పోస్తున్నాను. సావిత్రీ, ఆ పలక అందుకో (తీసుకొని వాటిని పూలేకి ఇవ్వబోయింది)

**పూలే** : (తీసుకోడు) అది నీకే!

**సావిత్రి** : నాకా? ఎందుకు శేఠ్‌జీ!

**పూలే** : ఈ క్షణం నుంచే నువ్వు చదువు నేర్చుకోవాలి.

**సావిత్రి** : అమ్మో! వద్దు, వద్దు శేఠ్‌జీ.

**పూలే** : ఎందుకు?

**సావిత్రి** : అది మీకు ఆయుక్షీణం.

**పూలే** : నువ్వు చదువుకొంటే నాకు ఆయుక్షీణమా?

**సావిత్రి** : అవును, భార్య చదువుకుంటే భర్త అర్ధాయుష్కుడవుతాడు.

**పూలే** : భార్య చదువుకుంటే భర్త అర్ధాయుష్కుడవుతాడా? నీకు యిలాంటివన్నీ ఎవరు నేర్పారు.

**సావిత్రి** : అలా అని బ్రాహ్మణభట్టులు చెబుతారు కదా.

**పూలే** : బ్రాహ్మణభట్టులకు మొగుణ్ణి, నేను చెబుతున్నాను విను. భార్య చదువుకుంటే భర్త పూర్ణాయుష్కుడవుతాడు. పూర్ణాయుష్కుడేకాదు. అతనికి ఎప్పటికీ మరణం వుండదు. నాకు మరణం లేకుండా చేస్తావా సావిత్రీ!

**సావిత్రి** : (తలవూపి నవ్వుతుంది. సావిత్రి చేయి పట్టి పూలే పలకమీద రాయిస్తాడు)

**పూలే** : అ....ఆ....!

-LIGHTS ON -

**వ్యాఖ్యానం3 :** అంధకారయుగం పటాపంచలైంది. భారతదేశం కాంతియుగంలోకి అడుగుపెట్టింది. భరతమాత పలకా బలపం చేత బట్టింది. జేజేలు పలకండి సావిత్రీబాయి ఫూలేకి. ఆమె భారతదేశపు మొట్టమొదటి విద్యార్థిని – ఉపాధ్యాయిని. ఫూలే దంపతులు నిమ్న జాతుల బిడ్డలకు మొట్టమొదట బిడే ఇంటి దగ్గర బుధవారపేటలో ఒక పాఠశాలను ప్రారంభించారు. ప్రపంచ చరిత్రలో 1848 సంవత్సరములో అనేక మార్పుల్ని తెచ్చింది. ఈ సంవత్సరం కార్లమార్క్స తన కమ్యూనిస్టు మేనిఫెస్టోని ప్రజలకందించారు. కానీ మన దేశంలోని అణగారిన వర్గాలకు కమ్యూనిజమ్ కన్న ఫూలే చేసిన విద్యావ్యాప్తి ఎక్కువ మేలు చేసిందని చరిత్రకారుల అభిప్రాయం. అయితే ఈ పురోగామిక చర్యకు చాందసులు ఎలా స్పందించారో చూడండి.

-LIGHTS ON -

## సన్నివేశం-4

(బ్రాహ్మణవీధి – భట్టు కులకర్ణి – వారి వెనుక అనుచరులు ధోండీరామ్, రోడే ఉన్నారు)

**భట్టు** : ఈ ఘోరం విన్నారా?... ఆ గోవిందరావు కొడుకూ కోడలూ కలిసి స్త్రీ జనోద్ధరణకు కంకణం కట్టుకున్నారు.

**కులకర్ణి** : వాళ్ల పిండాకూడు... స్త్రీ జనోద్ధరణ ఏమిటండీ...

**భట్టు** : చదువూ సంధ్యా లేకుండా ఆడది, మగాడి అహంకారానికి తలవంచి వంటింట్లో మగ్గిపోతూ వుందట... అది అన్యాయమట... అక్రమమట. అందుకే ఆ ఫూలే ఆడవాళ్లకు చదువు నేర్పించడానికి బడి కూడా పెట్టాడు.

**కులకర్ణి** : అవ్వ! అవ్వ! ఇంతకన్నా పాతకం మరోటి వుంటుందా?

**భట్టు** : ఆ ఫూలేగాడే స్వయంగా పెళ్ళానికి చదువు నేర్పించి ఆడాళ్లందరికీ చదువు నేర్పమని దేశం మీదికి తోలాడట.

**కులకర్ణి** : ఇది సహించరాని విషయం.... ఆడది చదువు నేర్చుకుని మగాడితో సమానమైపోతుందా! అలా ఎన్నటికీ జరగటానికి వీల్లేదు! ఆ మొగుడూ పెళ్ళాలకు బుద్ధి చెప్పాల్సిందే.

**భట్టు** : లేకపోతే వాళ్ల మాటలు నమ్మి చైతన్యం, చైతన్యం అంటూ ఆడాళ్లందరూ వీధిన పడతారు. ఇక మనల్ని లెక్కచెయ్యరు. అదిగో! సిగ్గూ లజ్జా లేకుండా ఎలా వస్తుందో చూడండి. (సావిత్రిబాయి వస్తోంది)

**కులకర్ణి** : తాను చెడింది కాకుండా మిగతా ఆడాళ్లను కూడా చెడగొట్టడానికి తయారైంది....

**భట్టు** : చూస్తూ వూరుకుంటే లాభం లేదు. మొగ్గలోనే తుంచెయ్యాలి... పదండి....

(ఆమెకు ఎదురుగా వెళ్లారు)

**భట్టు** : ఆగవే! ఆడదానికింత సాహసం కూడదు.

**కులకర్ణి** : ఏం చూసుకొని ఇంత పాపానికి తయారయ్యావే.

**సావిత్రి** : నేను చేస్తున్నది పాపం కాదు.

**భట్టు** : పాపం కాక ఏవిటిది? వంటింట్లో వంట పని చేసుకోవాల్సిన ఆడదానివి చదువుకుంటావా!

**కులకర్ణి** : అక్కడితో ఆగకుండా మగాడి తోడు లేకుండా ఊపుకుంటూ ఊరి మీద పడి తిరుగుతావా? చెప్పులేసుకొని మరీ...

**భట్టు** : శాస్త్రం, సమాజం, సాంప్రదాయం ఇవేవీ స్త్రీకి ఇంత స్వేచ్ఛ ఇవ్వలేదు.

**సావిత్రి** : స్త్రీకి ఎందుకు స్వేచ్ఛ ఇవ్వకూడదో చెప్పగలరా?

**భట్టు** : అమ్మో? ప్రశ్నిస్తుందండీ! ప్రశ్న! ప్రశ్నించిన ఆడదాన్ని క్షమించకూడదు. స్త్రీకి స్వతహాగానే వివేకం లేదు. విచక్షణా జ్ఞానం లేదు. మూర్ఖురాలు. పైగా స్త్రీ స్వభావం అతిచంచలమైంది. స్వేచ్ఛనిచ్చి నలుగురితో తిరగనిస్తే ఎవరితో ఏం చేస్తుందోనని భయం.

**కులకర్ణి** : అందుకే చిన్నప్పుడు తండ్రి రక్షణలో, పెళ్ళాయ్యాక భర్త పాలనలో, ముసలయ్యాక పిల్లల పోషణలో స్త్రీలు ఉండాలని నిర్ణయించారు.

**భట్టు** : "స్త్రీ బుద్ధి ప్రళయాంతకం" గనుక, "నస్త్రీ స్వాతంత్ర్య మర్హ" అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

**సావిత్రి** : ఆపండి! బుద్ధుందా మీకు. ఆడదాన్ని చులకనగా చూసిన ఏ జాతికి పురోగతి ఉండదు. స్త్రీ పట్ల విశ్వాసం లేకపోతే మీ పుట్టుక పట్ల మీకు విశ్వాసం లేనట్టే... ఇన్నాళ్లు జరిగిందేదో జరిగిపోయింది. స్త్రీ చేతికి వేసిన

గాజుల్నే బంధనాలుగా మార్చి ఆమెను హింసించకండి. ఆమెకింత స్వేచ్ఛనిచ్చి చదువుకోనివ్వండి.

**కులకర్ణి** : అంటే నీ ఉద్దేశ్యమేంటే – స్త్రీలకు స్వేచ్ఛ నిచ్చి నీలా ఊరి మీదకు వదిలెయ్యాలా! ఇంకా చూస్తారేమ్రా! దీని పిచ్చి ప్రేలాపనలు, మీ పెళ్లాల చెవుల్లో పడితే వాళ్లు మీతో కాపురాలు జేస్తారా? దీనిలాగే బరితెగించి వీధుల్లో తిరగరూ! మొత్తం స్త్రీజాతినే నాశనం చెయ్యడానికి పూనుకున్నావుగదే! నీదీ ఒక ఆడజన్మే! థూ! (నములుతున్న తాంబూలం ముఖం మీద ఉమ్మేసి వెళ్లిపోయాడు. మిగతావాళ్లు కూడా ఉద్రేకంతో తలమీద ఇసకపోసి, రాళ్లతో గాయపర్చారు – ఒంటరిగా ఏడుస్తూ నిలబడి పోయింది సావిత్రీబాయి – అది చూసిన పూలే పరుగెత్తుకుంటూ వచ్చి తలకు కట్టు కట్టాడు)

**పూలే** : సావిత్రీ! ఇప్పుడు నీ మనసులో ఏ భావముందో తెలుసుకోవచ్చా.

**సావిత్రి** : నన్ను అవమానించిన ఆ బ్రాహ్మణభట్టులని క్షమించమని కోరుకుంటున్నాను సేఠ్‌జీ.

LIGHTS OFF - LIGHTS ON

## సన్నివేశం–5

(గోవిందరావు ఇల్లు)

(తలకట్టుతో సావిత్రి, పక్కనే పూలే ఉన్నారు, గోవిందరావు కుర్చీలోంచి లేచాడు)

**గోవిందరావు:** నీ కడుపున పుట్టిన బిడ్డలుంటే నీకు తెలిసేదిరా. నా కడుపు కోత. నువ్వేం జేస్తున్నావో నీకు తెలుసా? నా మీద ఎందుకురా నీకు కోపం. నేనేం చేశానురా నిన్ను. నిన్ను కన్నందుకా నా మీద పగ? నన్నంతగా బాధపెట్టాలనుకుంటే వూళ్లో వాళ్లతో ఎందుకురా తన్నించడం. నువ్వే కొట్టరా! నన్ను చంపెయ్! (లోపలికి వెళ్లి చర్నాకోల తెచ్చి పూలే చేతికిస్తాడు) చంపెయ్‌రా నన్ను (వొంగాడు) యేంరా, కొట్టు, కొట్టరా, ఈ చర్నాకోలతో కొట్టరా! పోనీ నీ పెళ్లాన్ని కొట్టు, కొట్టరా. మొగుడు పెళ్లాన్ని కొడితే అందం చందం. ఊళ్లో మొగోళ్లతో కొట్టిస్తున్నావు. నువ్వొక మనిషివేనారా? మన వంశంలో యింతవరకూ యింత అవమానం

యెప్పుడూ జరగలేదు. ఆ పిల్ల తండ్రి ఆ జగదేవ్‌పాటిల్‌కి నేను నా మొహం ఎలా చూపించాలి. మొన్న నిన్ను తన్నారు. ఈ రోజు నీ పెళ్లాన్ని తన్నారు. రేపు నన్ను తంతారు. తర్వాత నీ అన్న రాజారాంని. వాడి పిల్లల్నీ ఒక్కొక్కర్నీ ఇలా మొత్తం అందర్నీ తంతారు. యింకేముందీ మాలీ కులమంతా అగ్గిబుగ్గైపోయింది. బ్రాహ్మణ భట్టుల చేతుల్లో మాడి మసైపోతుంది. నువు చేసే పనులకు మన కులం వాళ్లు వెలేస్తామంటున్నారు. కులంలో విలువలేక పోయాక ఆ బతుకెందుకమ్మా! కులానికింత మచ్చ తెస్తావనుకోలేదురా... ఒరేయ్! వెళ్లిపోండిరా ఇళ్లొదిలి వెళ్లిపోండిరా! ఒరేయ్! ఈ ఆఖరి దశలో నన్ను ప్రశాంతంగా బతకనివ్వరా!....

**ఫూలే** : నాన్నా! మా వల్ల నీకు ప్రాణహాని కలగడం నాకిష్టం లేదు. అన్నయ్య కుటుంబానికి ఇబ్బంది పెట్టడం భావ్యం కాదు... అయితే ఈ సమస్యకు రెండే రెండు పరిష్కారాలున్నాయి. నాన్నా! ఈ రెండు వేళ్లలో ఒకటి పట్టుకో నాన్నా!

**గోవిందరావు:** పోరా!

**ఫూలే** : పట్టుకో నాన్నా! చిన్నప్పుడు నాకేదైనా కావాలన్నప్పుడు రెండు వేళ్లు చూపించి ఏదో ఒకటి పట్టుకో మనేవాడివి. పట్టుకో నాన్నా! ఈ రెండూ రెండు పరిష్కారాలు నాన్నా! ఒకటి ఇప్పుడు నేను చదివిందంతా మర్చిపోయి, ఇకముందు కూడా చదువు జోలికి పోకుండా, బ్రాహ్మణభట్టులు కాలుకడిగిన నీళ్లు తాగుతూ అతిహీనంగా ఒరేయ్ ఫూలేగా! అని పిలిపించుకోవడం ఒక పద్ధతి. లేదా ఇంకో పోరాటం చేసి అణగారిన వర్గాల్ని ఈ అనాగరిక భావదాస్యం నుండి విముక్తి కలిగించి గోవిందరావుఫూలే గారు అని పిలిపించుకోవడం రెండో పద్ధతి. నీకేది కావాలో ఒక్కసారి నిర్ణయించుకో నాన్నా!

**గోవిందరావు:** ఒరేయ్ నువు మారవురా! నీకెన్ని చెప్పినా నీ పద్ధతి మార్చుకోవురా! వెళ్లిపోరా! నా ఇంట్లోంచి వెళ్లిపోరా! నీ మూట ముల్లె సర్దుకుని వెళ్లిపోరా!... నా ఇంట్లో ఉండొద్దు వెళ్లిపోరా! (లోనకెళ్లి పెట్టే బేడా తెచ్చి బయటపడేశాడు) నేను నీకు చెబుతున్నా విను. నువు పెట్టిన బడులని మానేసి ఉంటే ఇంట్లో ఉండండి. లేకపోతే మీకు, నాకు ఉన్న సంబంధం తెగిపోయినట్లే. మీరే తేల్చుకోండి.

**పూలే** : నాన్నా! పడవకు ఒడ్డునున్నంత సేపు ఏ ప్రమాదముండదు. కానీ దాని పని ఒడ్డున చచ్చినట్టు పడి ఉండటం కాదు నాన్నా! కెరటాలకి ఎదురెళ్లాలి. గాలివానల్ని, తుఫానుల్ని ఎదుర్కోవాలి. అప్పుడే దానికి సార్థకత. సావిత్రీ – పెట్టె తీసుకో.

**సావిత్రి** : (పెట్టె తీసుకుంది – పూలే చేతిలోని చర్నాకోలాను చూసి) సేఠ్ జీ! ఇదెందుకు.

**పూలే** : అమ్మో! ఇది నా పిత్రార్జితం. నా తండ్రి నాకిచ్చిన ఆస్థి. దీంతో నాకు చాలా పని ఉంది. పద.. వెళ్దాం. వస్తాం నాన్నా!

**సావిత్రి** : (వెళ్లి మామయ్య కాళ్లకు నమస్కారం చేసింది – ఇద్దరు బయటకు వెళ్లిపోయారు) (గోవిందరావు ఒక్కడే మిగిలిపోయాడు – గోవిందరావు మనస్సులో జ్యోతిరావు మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి.)

(–ఒరేయ్ పూలేగా.

–జ్యోతిరావు గోవిందరావు పూలే గారూ!

– రెండు పిలుపులు ప్రతిధ్వనిస్తున్నాయి. ఈ రెండు పిలుపుల్లో రెండవదే హాయిగా విన్పించింది. గౌరవంగా తోచింది. ఒక ప్రక్క భయమూ, దాన్ని మించిన ఆనందం ఆవహించగా మురిసిపోయాడు, అలా మురిసిపోయినందుకు మళ్లీ భయపడ్డాడు.)

LIGHTS OFF - LIGHTS ON

## సన్నివేశం–6

(బ్రాహ్మణవీధి)

**కులకర్ణి** : భట్టు బావా! ఆ జ్యోతిరావు పూలేగాణ్ణి వెలేశారంట గదా వాళ్ల కులంవాళ్లు యేమైనా మాలీ కులమంటే మాలీ కులమే బావా. కట్టుబాటు గల కులం! శూద్రుల్లో అతి శూద్రపు కులమైనా, మనకు అణిగి మణికి ఉండే కులం. పద్ధతిగల కులం.

**భట్టు** : వెలీగాదు పాడూ గాదు. ఆ గోవిందరావు, అదే ఆ పూలే గాడి బాబు మహాకిలాడిగాడు! వాడి నాటకం ఇదంతా. కులం వెలివేస్తుందేమోననే భయంతో ముందుగానే ఇంట్లోంచి బయటకు పంపించేసాడు. మనబోటి వాళ్లం గట్టిగా అడిగామనుకో వాడికీ నాకూ ఏ సంబంధం లేదు

పొమ్మంటాడు. పెద్ద కొడుకుతో యింట గెలిచి చిన్నకొడుకుతో రచ్చగెలవానుకుంటున్నాడు.

**కులకర్ణి** : యింట గెలవడానికి పెద్దకొడుకు. రచ్చ గెలవడానికి చిన్న కొడుకు. విభజించి పాలిస్తున్నాడు బావా... ఆ గోవిందరావు.

**భట్టు** : నాకు మాత్రం భయంగా ఉంది. ఆ జ్యోతిరావు యింట్లో వున్నప్పుడే మన బ్రాహ్మణ బనియాల సమాజానికి అరికాళ్ల కింద మంటల పెట్టాడు. యిప్పుడు వాడికి కుల భయమూ పోయింది. తండ్రి భయమూ పోయింది. యింక ఏకంగా మనల్ని తగలబెడతాడేమో!

**కులకర్ణి** : మనది వామనుడి రాజ్యం అట. వాడిది బలి చక్రవర్తి రాజ్యం అట.

**భట్టు** : వీడు బలి చక్రవర్తిననుకుంటున్నాడేమో తొక్కేస్తాం! వెధవని.

**కులకర్ణి** : బావా! కోండిబా కొడుకు, అదే బాబ్యా గాడు తాళపత్ర గ్రంథాలు దొంగిలించాడని సీసం పోసి చంపేసినా...ఒక్కడూ చదువులు మానడం లేదే! పైగా రోజు రోజుకి శూద్రుల్లో చదివే వారి సంఖ్య ఎక్కువైపోతోంది...

**భట్టు** : బావా! పొయ్యాల్సింది సీసం కాదేమో! (భళ్లాచార్య రావడం చూసి)... భళ్లాచారి... భళ్లాచారి.

**కులకర్ణి** : (సర్దుకుంటూ) ఇప్పుడు.... సీసమంటే... బంగారం, వెండి, పంచలోహాలు మొదలైనవి... అదే శతక కారుడు ఏమన్నాడు? కంచు మ్రోగినట్టు కనకంబు మ్రోగునా అన్నాడు.

**భట్టు** : అన్నాడా! అనే ఉంటాడు... (భళ్లాచార్య వాళ్ల ముందుకొచ్చాడు)

**భళ్లాచారి** : నమస్కారం ఆర్యభట్టుగారూ.

**భట్టు** : నమస్కారం భళ్లాచార్యా

**కులకర్ణి** : నమస్కారం భళ్లాచార్యా!

**భళ్లాచారి** : నేనొక్క ప్రశ్న అడగవచ్చా? ఆ జ్యోతిరావు పూలే అంటే మీకు యెందుకింత ద్వేషం? జందెపుపోగు ధరించిన వాడి గుండెలో సమాజం పట్ల ప్రేమ వుండాలి. పొట్టలో విషం వుండకూడదు.

**భట్టు** : మా పొట్టలో విషమా?... మనం బ్రతికే ఉన్నాంగా.. మరి విషమంటాడేమిటి?... జీవహింస పాపం అంటాం! అది విషమా?

**కులకర్ణి** : చీమను చంపినా పాపం అంటామే అది విషమా?

**భళ్లాచారి** : కానీ మనుషుల్ని మాత్రం కులం తక్కువ అని వూరికి దూరంగా నెట్టాం. దీన్నే ఎదిరిస్తున్నాడు! జ్యోతిరావు పూలే! మహానుభావుడు.

**కులకర్ణి** : అంటే – మాలీ కులస్తుడయినా అతడే మహానుభావుడంటావ్!

**భట్టు** : (జంధ్యాన్ని చూపిస్తూ) దీనికే మాత్రం విలువ ఆధిక్యం లేవంటావ్!

**భళ్లాచారి** : గుండెమీద వేసుకున్న పోగువల్లే మనం అధికులైతే దాన్ని దారంగా మలిచిన నేత కార్మికుడు, ఆ దారానికి జన్మనిచ్చిన రైతు కూలీ మనకన్నా యెంత గొప్పవాళ్లో ఆలోచించండి. అలాంటి వారి కోసం పోరాడుతున్న జ్యోతిరావు పూలే మహానుభావుడే కాదు మహాత్ముడు కూడా!

**భట్టు** : ఛీ! నువు అగ్రకులంలో చెడబుట్టావ్ – కొట్టండ్రా వీడ్ని (అనుచరులు కర్రలు పైకెత్తారు)

**కులకర్ణి** : ఆగండి! కొట్టాల్సింది వీడ్ని కాదు.

**భట్టు** : వీడ్ని! కాదా!

LIGHTS OFF - LIGHTS ON

## సన్నివేశం–7

(పూలే ఇల్లు)

**సావిత్రి** : ఏవిటండీ! ఇవి కూరగాయలా?

**పూలే** : అనే కదా తీసుకొచ్చింది.

**సావిత్రి** : తీసుకొచ్చారు సరే! వీటినెలా వండమంటారు? కొన్ని పుచ్చిపోయాయి, మరికొన్ని పురుగులు పట్టాయి.

**పూలే** : సావిత్రీ! నీకు తెలీదు. ఇవెంత శ్రేష్టమో.

**సావిత్రి** : ఇది మరీ విడ్డూరం. ఇవి శ్రేష్టమైనవా!

**పూలే** : పుచ్చిపోయిన వాటిని ఉడకబెట్టనక్కర్లే. అలా తినేసినా తేలిగ్గా జీర్ణమైపోతాయి. ఇక పురుగులు పుట్టినవి ఉన్నాయి చూడు. అవి ఇంకా మంచివి. ఎలా అంటే, చిలక్కొట్టిన జామపండ్లు ఎంత రుచిగా ఉంటాయో పురుగు పట్టిన కూరగాయలు కూడా అంతే రుచిగా ఉంటాయి. ఆహార సంపాదన కన్నా జ్ఞాన సంపాదన ముఖ్యం. మనసు దానిమీద లగ్నం చేద్దాం!

**సావిత్రి** : చెప్పండి!

**పూలే** : మనది నిచ్చెన మెట్ల సమాజం.

**సావిత్రి** : ఊ!

**పూలే** : సమాజ వర్గీకరణ, సహజ సంపదల పంపిణీ, తద్వారా వచ్చే ఆస్తులు, అంతస్థులు, ప్రజల్లో పొడచూపే అసంతృప్తులు – అన్నీ సమానంగా ఉండవు.

**సావిత్రి** : నాకర్థం కావట్లేదు.

**పూలే** : పురాతన మానవ జాతుల్లో భారతజాతి ఒకటి. అయితే అదిప్పుడు ఒక జాతి కాదు. అనేక జాతుల సమూహం. ఒక దానిపై ఒకటి దండెత్తుకుంటూ ఓడిన వారిని వారి స్వంత దేశంలోనే బానిసలుగా బహిష్కృతులుగా మార్చారు. అలా మార్చబడిన వారే మాంగ్ మహర్లు. ఇక సంపదల్ని సృష్టిస్తున్న కమ్మరి, కుమ్మరి, సాలి, కంసాలి మొదలైన వారిని, సేవావృత్తులు చేస్తున్న చాకలి, మంగలి వంటి మరికొందర్నీ నీచకులాలుగా చూస్తున్నారు. ఉన్నాడో లేడో తెలీని దేవుడ్ని పూజించే పురోహితులు పెద్దవాళ్లుగా, పునీతులుగా చెలామణి అవుతున్నారు. ఇక ప్రజల్ని పరిపాలించే కులాలు మరికొన్ని ఉన్నాయి. వాళ్లు పురోహితులకు వంత పాడుతున్నారు. ఒక్కమాట చెప్పు సావిత్రీ! మాంగ మహర్లని మనుష్యులుగా చూస్తున్నారా? పశువులు, పక్షులు వాళ్లకన్నా స్వేచ్ఛగా బ్రతకడం లేదూ? స్త్రీలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం మాట అటుంచి, కనీస వ్యక్తిత్వం, గౌరవం లభిస్తున్నాయా? దీనంతటికి కారణమేమిటి తెల్సా? నిరక్షరాస్యత. అక్షరం అగ్నికణం. అది మెదడుని జ్వలింపచేస్తుంది. మనసుని చలింపజేస్తుంది. తరతరాలుగా గడ్డకట్టుకుపోయిన మేధస్సుని కదిలించనిదే మానవ జీవితంలో కదలిక రాదు.

**భల్లాచారి** : జ్యోతిబా! జ్యోతి బా!

**పూలే** : ఎవరిది? లోనకిరండి. (బయటనుండి బల్లాచార్య వచ్చాడు)–ఎవరు మీరు

**భల్లాచారి** : నన్ను బల్లాచార్య అంటారు.

**పూలే** : ఏంటిలా వచ్చారు.

**భల్లాచారి** : జ్యోతి బా! నిమ్న జాతుల కొరకు, స్త్రీల కొరకు మీరు చేస్తున్న సేవల గురించి తెల్సుకున్నాను. చాలా సంతోషం. ఇదిగో ఉడతాభక్తిగా ఒక నెల జీతం, పన్నెండు రూపాయలు... ఖర్చు పెట్టండి.

**ఫూలే** : చూసావా సావిత్రీ! వారి నెల జీతం మనకు విరాళంగా ఇచ్చారు. నేనప్పుడే చెప్పాను. కొన్నాళ్లకు బ్రాహ్మణులు కూడా మనల్ని సమర్థిస్తారని. చూడు కొందరైనా మనల్ని అర్థం చేసుకుంటున్నారు.

**భల్లాచారి** : ఎందుకర్థం చేసుకోరండీ! అహం బ్రహ్మాస్మి అనుకొని పొగరు పట్టిపోయారు గానీ అహంకారమే లేకపోతే సమాజానికి బ్రాహ్మణుడు అలంకారమే కదండీ.

**సావిత్రి** : బాగా చెప్పారు... మేము వ్యతిరేకిస్తున్నది కేవలం కుల తత్వాన్నేగానీ, ఏ ఒక్క కులాన్ని కాదు కదండీ. కానీ చీటికి మాటికి బ్రాహ్మలు మా మీద కాలు దువ్వుతున్నారు.

**భల్లాచారి** : పూనా అబ్జర్వర్, టెలిగ్రాఫ్ అండ్ కెరీర్ లాంటి పత్రికలు ఫూలే గురించి బ్రహ్మాండంగా రాసాయి. మీరు ఎంచుకున్నది సత్య మార్గం – మీరు ప్రపంచానికి వినిపిస్తున్న గళం ఆ శంకరుని చేతిలోని ఢమరక శబ్దం కన్నా గొప్పది. వెధవ మా వాళ్ల కీచక గొంతులు కీచు గొంతులు మిమ్మల్నేవీ చెయ్యలేవు. అమ్మా! మిమ్మల్ని చూస్తే ఒక్క మాట చెప్పాలనిపిస్తోంది. ఈ సృష్టి ఆరంభంలో కన్నుపొడుచుకున్న కానరాని కటిక చీకటి ఉండేదట. సర్వత్రా గాఢాంధకారం నెలకొని ఉందట. ఇన్ని యుగాలు గడిచినా మాంగులు, మహర్ల జీవితాల్లో అదే చీకటి, అదే గాఢాంధకారం ఉన్నాయి. వారి నిశీధి బ్రతుకుల్లో వెలుగు నింపడానికి వచ్చిన జ్యోతిర్లింగాలు మీరు. మీ ప్రయత్నాన్ని ఈ కుహనా దైవాంశసంభూతులు అడ్డుకోవచ్చు. కానీ ఆ దేవుడు హర్షిస్తాడు. ఆ దేవుడు హర్షిస్తాడు. ఆ దేవుడు తప్పక హర్షిస్తాడు. (అతను వెళ్లిన వైపు చేతులు జోడించి నమస్కరిస్తూ అలా ఉండిపోయారు)

(ఫూలే దంపతులు భోజనాలు ముగించి నిద్రపోతున్నారు. ఆ రాత్రి ఇద్దరు హంతకులు కత్తులు పట్టుకొని ఫూలేని చంపాలని వచ్చారు)

**ధోండీ** : వొరే.... అటు కాదురా... యిటు....

**రోడే** : యిటు వద్దురా... వెనక నుంచి వెళ్దాం.

**ధోండీ** : అటొద్దురా యిటురా.... (చీకట్లో వస్తువులు తగిలి క్రిందపడి అలికిడైంది. ఆ అలికిడికి ఫూలే బయటకు వచ్చాడు)

**ఫూలే** : యెవరదీ? యెవరూ? యెవరక్కడ?

**ధోండీ** : అరే.... లేచాడురా... వెనక్కి వెళ్లి పట్టుకో గట్టిగ పట్టుకో! ఒకే వేటు... ఈ దెబ్బతో మన కష్టాలన్నీ తీరిపోవాల.

**రోడే** : అలాగే... అలాగే (పూలే మీదకు దూకాడు. పూలే తిరిగి వాణ్ణి పట్టుకుని కిందపడేసి కత్తి లాక్కుని వాడిమీద కాలేసి యింకొకడి కత్తిని పడకొట్టి ముసుగు లాగేస్తాడు)

**పూలే** : వొరే ధోండీరామ్... నువ్వా? నన్ను చంపడానికి వొచ్చార్రా మీరు? కత్తి పట్టడం కూడా రాదు. వీడెవడు?

**ధోండీరామ్** : రోడేగాడు.

**పూలే** : వొరే రోడే! వొరే ధోండీరామ్!.... యిప్పటివరకూ మీరు చేసిన అఘాయిత్యాలు చాలవంట్రా? చివరికి నన్ను చంపడానికొచ్చారా? చేతిలో కత్తి వుంటే ఈ పూలేను చంపెయ్యొచ్చు అనుకున్నారా? పిరికి సన్నాసుల్లారా! యేం పాపం చేశాన్రా నేను?

**ధోండీరామ్** : మీరు బతికుంటే వర్షాలు పడవంట, భూకంపాలొస్తాయంట.

**పూలే** : నేను బతికుంటే భూకంపాలొస్తాయ? నన్ను చంపేస్తే?

**ధోండీరామ్** : మిమ్మల్ని చంపేస్తే మాకు చాలా పుణ్యం వస్తుందంట.

**పూలే** : నన్ను చంపితే పుణ్యం వొస్తుందా? నా మీదకి మిమ్మల్ని వుసిగొలిపింది ఆ బ్రాహ్మణ భట్టులే గదా! ఎంత పుణ్యం వస్తుందని చెప్పారు?

**ధోండీరామ్** : డబ్బులు యిస్తామన్నారయ్యా.

**పూలే** : అదే ఎంత ఇస్తామన్నారు.

**ధోండీరామ్** : వెయ్యి రూపాయలయ్యా.

**పూలే** : వెయ్యి రూపాయలే!!! వీశెడు బంగారం వస్తుంది. నా రేటు వీశెడు బంగారమా! బ్రాహ్మణభట్టులు నాకు ఖరీదు బాగానే కట్టారే! ఈ హడావిడిలో మరిచిపోయాను యింతకీ మీరు అన్నం తినే వచ్చారా?

**ధోండీరామ్** : నేను తిన్నానయ్యా వీడు తినలేదు.

**రోడే** : ఆ.... నేను తిన్నాను. వీడే తినలేదయ్యా.

**పూలే** : అంటే యిద్దరూ యేమీ తినలేదు. బుర్రలు ఖాళీగా వున్నా ఫర్వాలేదు గానీ కడుపులు ఖాళీగా వుంటేనే ప్రమాదం. సావిత్రీ... మన యింటికి అతిథులొచ్చారు. తినడానికి యేమయినా వుంటే తీసుకురా.

**సావిత్రి** : (లో నుండి) ఆ సేఠ్ జీ! (బయటకు వస్తూ) యింత అర్ధరాత్రి వచ్చిన అతిథులెవరూ?

**పూలే** : వీళ్లు మన తపస్సుకు మెచ్చి వరం యివ్వడానికి బ్రాహ్మణ భట్టులు పంపిన దేవతలు! ఇది మన గెలుపుకి సంకేతం! సిద్ధాంతాలతో ఓడిపోతున్నప్పుడు మనిషిని మట్టుబెట్టాలని చూస్తారు. వీరిని నన్ను చంపమని పంపించారు.

**సావిత్రి** : ఎవరు?

**పూలే** : ఇంకెవరు? అగ్రవర్ణాల వాళ్లు. పిల్లలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేనప్పుడు పెద్దలు విసుగుకొని వాళ్లను కొడతారు. చరిత్రలో దగాపడిన, అణగారిన వర్గాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేనప్పుడు హత్యలకు పాల్పడుతారు. నన్ను చంపితే వెయ్యిరూపాయిలిస్తామని వీళ్లకు ఆశపెట్టారు.

**సావిత్రి** : అయితే వెయ్యి రూపాయలూ పోయినట్టే! మా సేఠ్‌జీ ఆరడుగుల ఆజానుభాహుడు. ఇరవైమందినైనా మట్టికరిపించగలరు. పాపం ఇద్దరు వచ్చారు. చాలా తక్కువగా అంచనా వేసారే! ఎంత అమాయకులయ్యా మీరు.

**పూలే** : సావిత్రీ... ఆకలితో వున్నవాళ్లతో హాస్యాలాడకూడదు. వాళ్లకు అన్నం పెట్టు. (సావిత్రీ బాయి లోనకు వెళ్లి ఒక కంచంలో అన్నం కలుపుతూ తీసుకువచ్చింది)

**సావిత్ర** : (ముద్దలు చేసి పెట్టుతూ) రండి! తినండి! కడుపు నిండా తినండి (తినిపించింది)

**పూలే** : మీ ఆకలి తీరాక, ఎప్పుడు కావాలంటే అప్పుడు మీ చేతిలో చనిపోవడానికి సిద్ధంగా ఉన్నాను. (ఆ మంచితనాన్ని భరించడం వాళ్ల వల్ల కాలేదు. బావురుమంటూ కాళ్లమీద పడ్డారు)

**ధోండీరామ్, రోడే** : అయ్యా! మమ్మల్ని క్షమించండి.

LIGHTS OFF

**వ్యాఖ్యానం** : కిరాయి హంతకులైన ఈ ధోండీరామ్, రోడే అనంతర కాలంలో జ్యోతిరావు పూలేకు కుడి ఎడమలుగా నిలబడ్డారు. రోడే చక్కగా చదువుకొని పండితుడై కాశీలో పండితులతో తలపడి వాళ్లను ఓడించాడు.

అనేక గ్రంథాలు రచించాడు. ఆయన రచించిన గ్రంథాల్లో "వేదాచార్" ప్రముఖమైనది. ఇక ధోండీరామ్ రెండు వందలమంది యోధుల్ని తయారు చేసి జ్యోతిరావు పూలే ఉద్యమానికి అండగా నిలబడ్డాడు జీవితాంతం. అది 1852 సంవత్సము అప్పటికి జ్యోతిబా వయస్సు - 25 సంత్సరములు. ఆ వయసులోనే బ్రిటిష్ ప్రభుత్వం పూలే సేవల్ని గుర్తించి సన్మానం చేసింది. విశ్రమాబాగ్ వాడలో ఈ సభ జరిగింది. ఈ సభకు అనేకమంది విద్యావంతులు, సంస్కరణ వాదులు హాజరయ్యారు. కొందరు విదేశీయులు కూడా వచ్చారు.

LIGHTS ON

## సన్నివేశం-8

(విశ్రమాబాగ్‌లో వేదిక ఏర్పాటయ్యింది. సభకు బాపూరావ్‌జీ అధ్యక్షత వహించాడు. ఇరువైపుల మేజర్ కాండీ, పూలే కూర్చొని ఉన్నారు)

**బాపూరావ్‌జీ :** అందరికీ నమస్కారం. ఈ రోజు మనమంతా ఎంతో ఆనందించదగిన రోజు. ఎందుకంటే మన జ్యోతిరావు పూలే శూద్రులను, అతి శూద్రులను విద్యావంతులుగా చేయడానికి పడుతున్న శ్రమతమాదులు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. అలాగే స్త్రీ విద్యా వ్యాప్తి కొరకు ఆయన ఎదుర్కొంటున్న ఆటుపోట్లు ప్రభుత్వం గమనించింది. అందుకే జ్యోతిరావుని "దుశ్శాలువా"తో సత్కరించడానికి పూనా కళాశాల ప్రిన్సిపాల్ అయిన మేజర్ కాండీగారిని పంపించింది. ఇప్పుడు అతను ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించవలసిందిగా కోరుతున్నాను.

**మేజర్ :** (లేచి) Now I will read out the order of the Government. For the relentless services rendered by Jyothi Rao Phule for educating the sudras and woman folk who were barred from education it is decided to bestow honour upon Sri Jyothi Rao Phule with dual Shawls.

(అందరూ చప్పట్లు కొట్టారు) శాలువాతో సత్కరించి పూలమాల వేశారు మేజర్ కాండీ. ...Now I request Sri Jyothi Rao Phule to speak a few words.

**పూలే :** అందరికీ నమస్కారం. జనాభాలో 90 శాతం ఉన్న శూద్రులకు, అతి శూద్రులకు చదువుని నిరాకరించే హక్కు ఎవరిచ్చారు, అలాగే మానవాళిలో సగ భాగం స్త్రీలు విద్యకు అనర్హుల్ని చేయడం ఎంత

దారుణం. అందుకే నా మనసు నన్ను ప్రేరేపించింది. ప్రతీక్షణం ఆలోచించాను. ఎలా వీర్ని ఈ అగాధంలోంచి బయటకు తీసుకురావాలా అని. వీళ్లందరికీ అక్షరాల వెన్నెలలు ఎలా చూపించాలి అని. ఇదొక బృహత్కార్యమని నాకు తెలుసు. మహాయజ్ఞమనే స్పృహ నాకు లేకపోలేదు. అయినా ప్రారంభించాను. మొదటి అడుగు భయం భయంగానే వేసాను. ఆ తర్వాత ఇదిగో మిత్రులంతా నాతో కలసి నడిచారు. నా పదంలో పదం కలిపారు. (భట్టు, కులకర్ణి, గంగ వెర్రులెత్తుతూ వచ్చారు)

**భట్టు** : ఆపండి ఆ తంతుని....

**కులకర్ణి** : ఈ సన్మానానికి మేము అంగీకరించం.

**భట్టు** : శూద్రుల్ని శాలువాలతో సత్కరించకూడదు. (ప్రేక్షకుల్లో ఉన్న భళ్లాచార్య లేచి)

**భళ్లాచార్య** : అని ఎవరన్నారు.

**ఇద్దరు** : (హతాశులై) ఆ! ఇక్కడ కూడా తగలడ్డావా?

**భళ్లాచార్య** : ఇక్కడే కాదు... ఎక్కడ మంచి ఉంటే అక్కడంతా నేనుంటాను... చెప్పండి ఎవరన్నారు శూద్రుడ్ని శాలువాతో సత్కరించకూడదని.

**భట్టు** : పూలే ఉన్నత వంశ సంజాతుడు కాదు. ఉభయ సంధ్యలు వార్చడు. మెదడులో బ్రహ్మజ్ఞానంగానీ, వైదిక వాఙ్మయంగానీ, ఉపనిషత్, గీతా సారాంశాలుగానీ లవవేశమైనా లేవు. యజ్ఞోపవీతం ధరించడం గానీ, యజ్ఞ యాగాదులు ఆచరించడంగానీ చేసి ఎరగడు... ఏ ఔన్నత్యం విరిగిపోతుందనండీ శాలువాతో సత్కారం, పుష్పమాలలతో అభినందించడం.

**భళ్లాచార్య** : అయ్యా! ప్రజల్ని దొంగలు రాత్రి దోచేస్తే, అది దొంగల పని. పట్టపగలు దోచేస్తే అది సంప్రదాయం. అలాంటి సంప్రదాయాల్ని అడ్డం పెట్టుకుని బ్రతికే మీలాంటి వారి కళ్లకు పూలే గొప్పదనమేంటో కనిపించదు.

**కులకర్ణి** : నీ కళ్లకు ఏమి గొప్పదనం కనిపిస్తుందో.

**భళ్లాచార్య** : నా కళ్లకు మట్టికి మారుపేరుగా పుట్టి పెరిగిన ఈ శూద్రుడే ఉత్తమ కుల సంజాతునిగా కనిపిస్తున్నాడు. అణగారిన వారిని అక్షరాస్యుల్ని చెయ్యాలని

అతను పడుతున్న తపనే వేదవేదాంగాల సారంకన్నా ఉన్నతంగా కనిపిస్తోంది. అతను చేపట్టిన విద్యావ్యాప్తి ఉద్యమమే, మీరు చెప్పిన యజ్ఞోపవీతంకన్నా, యజ్ఞ యాగాదిక్రతువుల కన్నా పరమ పవిత్రమైనదిగా కనిపిస్తున్నది. అందుకే ఈ సన్మానానికి ఫూలే అన్ని విధాలా అర్హుడు, అర్హుడు, అర్హుడు...

**ప్రజలు** : జ్యోతిరావ్ ఫూలే.. జై.. జై... (అంటూ నినాదాలు చేసారు.)

**భట్టు** : ఇదిగో బళ్లాచార్య మనుషుల్లో ఎక్కువ, తక్కువ అన్నది మేము సృష్టించిందిగాదు. ఆ భగవంతుడే.

**భళ్లాచార్య** : తప్పు... మంచికి, చెడుకు మధ్యనున్న తేడా తెలుసుకోమని దేవుడు బుద్ధినిస్తే, ఆ బుద్ధిని ఉపయోగించి మనుష్యుల్లో తేడాలు సృష్టించి, ఎక్కువ తక్కువనే భావాన్ని కల్పిస్తున్నారు మీరు. నా దృష్టిలో ఫూలే మనకన్నా ఎంతో గొప్పవాడు.

(ఫూలేకి జై...జై... అంటూ నినాదాలు చెయ్యడంతో పురోహిత వర్గం తోకముడిచింది.)

-LIGHTS ON-

**వ్యాఖ్యానం** : అది 1969 సంవత్సరము – మాంగ్ మహర్ల జీవితాలలో జ్యోతిరావు ఫూలే దంపతులు ఒకరిగా మారిపోయిన సంఘటన ఇది.

-LIGHTS ON-

## సన్నివేశం-9

(కోండిబా భయం భయంగా బావి దగ్గరకు కుండతో వచ్చాడు. అటూ యిటూ చూసి నీళ్ళలో ముంచాడు. యెవరూ చూడలేదు గదా అన్నట్లు భుజాన కడవతో వెళుతుండగా...)

**పాటిల్** : (ప్రవేశిస్తూ) రేయ్ యెవడ్రా అది? మాంగ్ వెధవ. నీళ్లు అన్నీ మైలపడిపోయాయి. బావి చెడిపోయింది గదరా. అలగా వెధవా! మాంగ్ వెధవా! దించరా కుండ. దించు కుండ! (కోండిబా గడగడలాడుతూ కుండ దించాడు)

**పాటిల్** : (కర్రతో నేల మీద కొట్టి) పోరా. (కోండిబా వెళ్లడు. కుండవైపు చూసి యేడుస్తాడు)

**కోండిబా** : (వొంగి నిలబడి) కొట్టండయ్యా. కానీ ఇన్ని నీళ్లియ్యండయ్యా. అయ్యా మా వాళ్ల యెవురిళ్లలోనూ మంచినీళ్లు లేవయ్యా. రెండు రోజులయ్యింది చుక్క నీళ్లు జూసి. మేం చచ్చినా గుక్కెడు నీళ్లు కూడా యివ్వకూడదని కట్టడి జేశారయ్యా. యెక్కడో పశువు జచ్చిపోతే మా వాళ్లు వెంటనే తీసుకెళ్లలేదని ఆ చచ్చిన జీవాన్ని మేం తాగే నీళ్ల గుంటలో పడేశారయ్యా. ఆ గొడ్డును తీసేసినా, ఆ నీళ్లు తాగడానికి పనికిరాకుండా పోయాయి. ఆ నీళ్లు తాగి అందరికీ జబ్బులొచ్చాయయ్యా. మా అయ్యది పెద్దకాలం. కాటికి కాళ్లు చాపుకుని వున్నాడయ్యా. నాలుక పిడచకట్టుకుపోయి గొంతెండి పోతుందయ్యా... నీళ్లు... నీళ్లు అని యేడుస్తున్నాడయ్యా. కన్నీళ్లు తాగుతున్నాడయ్యా. యింక యేడ్వడానికి కూడా కన్నీళ్లు లేవయ్యా. కొట్టండయ్యా, కానీ కాసిన్ని నీళ్లియ్యండయ్యా. కావాలంటే మా రక్తం ఇస్తాం – మాకు మంచినీళ్లు ఇప్పించండయ్యా!

(సావిత్రిబాయి వచ్చింది)

**సావిత్రి** : కొట్టడం యేమిటి నాన్నా! యేం జరిగింది?

**పాటిల్** : నీళ్లు దొంగతనం చేశాడమ్మా! దొంగతనం చేసినా ఫర్వాలేదు! నీళ్లు ముట్టుకున్నాడమ్మా! మన బావి మైలపడిపోయింది.

**సావిత్రి** : నీళ్లు తోడుకుంటే దొంగతనమా? ముట్టకుంటే నీల్లు మైలపడిపోతాయా? ముందు ఆ కర్ర కిందపడెయ్!... పడెయ్... నాన్నా!

**పాటిల్** : ఆ... ఈ మాంగ్ వాడి ముందు అవమానిస్తావా నన్ను? వెర్రి పట్టిందే నీకు. మీ మామ.... ఆ గోవిందరావు అంటుంటే యేదో అనుకున్నా. పాటిల్! చూశావా నీ కూతురు అని అంటుండేవాడు. ఏం చెప్పాలో తెలీలేదు! అనీ! అనీ! ఆయన పోయాడు. ఇప్పుడు నా కళ్లతో చూస్తున్నా! మాంగులూ మహర్లూ మన యిళ్లలోకి రావొచ్చా అసలు! నీళ్ళు ముట్టుకోవచ్చా అసలు? కర్రతో ఒక దెబ్బ వేసినందుకే నా మీద కన్నెర్ర జేస్తున్నావే! నువ్వు మాలీ బిడ్డవేనా?

(ఫూలే వచ్చాడు)

**ఫూలే** : మామయ్యా. కర్ర పడెయ్యండి. (పాటిల్ కర్ర పడేశాడు) కొట్టడం తప్పని వొప్పుకోండి.

**పాటిల్** : నేను వొప్పుకోను. అది మన మంచినీళ్ల బావి. వాడు దాన్ని ముట్టుకున్నాడు. తప్పు వాడిది.

**పూలే** : నీళ్లు ముట్టుకోవడమే తప్పయితే మన మంచినీళ్ల బావిని ఈ క్షణమే మాంగ్‌లకూ మహర్లకూ అంటరాని వాళ్లకూ రాసిచ్చేస్తున్నాను. యిప్పటి నుంచి వాళ్లు ఈ నీటిని యథేచ్ఛగా వాడుకోవచ్చు.

**పాటిల్** : అయితే మీకు నాకు ఏ సంబంధం లేదు – మీ ఇంటికే రాను.

**పూలే** : కోండిబా! మన వాళ్లంతా నీటి కోసం ఏ ఇబ్బంది పడనక్కర్లేదు. అందరికీ చెప్పు! ఈ బావి మీది.

**సావిత్రి** : నాన్నా! నా భర్తను వ్యతిరేకించే వాళ్లు నా యింటికి రానవసరం లేదు.

**పాటిల్** : నీకేమైనా పిచ్చిపట్టిందా! సావిత్రి అని పేరు పెట్టినందుకు భర్తను రక్షించుకోవాలి. కానీ నువ్వు అతనితో పాటు ఆపదల్లో పడుతున్నావు. ఇప్పటికైనా మించిపోయింది లేదు ఇకనైనా ఈ సంఘసేవను కట్టిపెట్టమని మీ ఆయనతో చెప్పు.

**సావిత్రి** : చెప్పను. చెప్పాల్సి వస్తే ప్రాణమున్నంతవరకు చెయ్యమనే చెబ్తాను.

**పాటిల్** : మీ ఖర్మ అనుభవించండి (కోపంతో వెళ్లిపోయాడు)

**కోండిబా** : (చలించిపోయి) మహాత్మా! ఆ రోజు బ్రాహ్మణభట్టులు నిన్ను కొట్టి అవమానించారని హేళనగా నవ్విన పాపాత్ముడ్ని. అయ్యా! మా మాంగులు, మహర్ల కోసం అయిన వాళ్లనే వొదులుకున్నావు. ఈ పేద కోండిబా గుక్కెడ నీళ్లడిగితే మొత్తం బావినే మా కులానికి రాసిచ్చావు. ఏమిచ్చిన నీ ఋణం తీర్చుకోగలం మహాత్మా! నన్ను క్షమించు మహాత్మా! నన్ను క్షమించు. (పూలే, సావిత్రి కడవ ఎత్తి కోండిబా భుజం మీద పెట్టారు)

LIGHTS OFF - LIGHTS ON

## సన్నివేశం-10

**(పూలే ఇల్లు)**

(పూలే చుట్టూ కొంతమంది కార్మికులున్నారు. వారిలో లోఖండే ఉన్నారు)

**పూలే** : లోఖండే జీ! చెప్పండి ఎలా సాగుతోంది కార్మిక ఉద్యమం.

**లోఖండే** : బాగానే సాగుతోంది. కానీ ఈసారి మనం ప్రభుత్వంతో మాట్లాడినప్పుడు, కార్మికుల పని గంటలు నిర్ణయించాలని చెప్పాలి జ్యోతిబా.

**పూలే** : ఓ తప్పకుండా! వాళ్లంతా మన కార్మిక సోదరులు. వారికి కార్మికుల ఐక్యత గురించి, హక్కుల గురించి వివరించండి లోఖండే గారు.

**లోఖండే** : కార్మిక మిత్రులారా! ఒకప్పుడు మన కార్మికుల చేత రాత్రులు పగళ్లు పని చేయించేవారు. వేతనం యాజమాన్యం దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేది. కానీ ఈ రోజున పరిస్థితి మారింది. రాత్రి పని బంద్ చేయించాం. అవసరమైన చోట షిఫ్ట్ పద్ధతి పెట్టించాం. ప్రభుత్వం వేతనాల గ్యారంటీ ఇచ్చింది. అన్నిటికన్నా ముఖ్యమైనది, ఒకరోజు శలవు దొరికింది. యంత్రాల్లా భావించిన మనల్ని మనుష్యులుగా గుర్తిస్తున్నారు. ఇదెలా సాధ్యమైంది. మనం ఊరేగింపులు చేసాం. సమ్మెలు చేసాం. జైళ్ల కెళ్లాం, లాఠీ దెబ్బలు తిన్నాం. ఇదంతా మన పూజ్య జ్యోతిబా సహకారంతో జరిగింది. వారి నాయకత్వంలో, వారి వ్యూహరచనలో జరిగింది. భారతదేశంలో కార్మిక ఉద్యమ నినాదం జ్యోతిబా గుండెల్లోంచి వచ్చిందని, కార్మికుల హక్కుల సాధనకు ఉపయోగపడే విప్లవబాట అతని మాటల్లోంచి పుట్టిందని తెలియజేయడానికి ఎంతో సంతోషిస్తున్నాను. (అందరూ చప్పట్లు కొట్టారు) ఇక మాకు శెలవిప్పించండి జ్యోతిబా! (వారిని సాదరంగా పంపిస్తూ వాళ్లతో పాటే పూలే బయటకు అనుసరించాడు - బయట నుండి సావిత్రీబాయి తండ్రి పాటిల్ కార్మికుల్ని చూసి ముఖం చిట్లించాడు)

**సావిత్రి** : ఎలా ఉన్నారు నాన్నా!

**పాటిల్** : బాగున్నానమ్మా! మీ ఆయన చేస్తున్న లోకోద్ధరణ మహాజోరుగా ఉన్నట్టుంది.

**సావిత్రి** : అయ్యో నెమ్మదిగా మాట్లాడు నాన్నా, ఆయనకు వినిపిస్తుంది.

పాటిల్ : ఏం ఆయన వింటే నా తల తీసి మొలేస్తాడా?... మీ ఇంటికి రానని చెప్పి మళ్లీ ఎందుకొచ్చానో తెల్సా?

సావిత్రి : నువ్వు చెప్పందే ఎలా తెలుస్తుంది. చెప్పండి నాన్నా!

పాటిల్ : చెప్పాల్సింది నేను కాదు. నువ్వు. ఏమాలోచించావు.

సావిత్రి : దేని గురించి నాన్నా!

పాటిల్ : అదేనమ్మా! నీకు పిల్లలు పుట్టలేదు కదా! ఏవన్నాడు.

సావిత్రి : సమాధానం నేనే చెబ్తానన్నారు.

పాటిల్ : నాకు చెబ్తానన్నాడా? అదేంటి?

సావిత్రి : ఏమో మరి! అదిగో వస్తున్నారు. నువ్వే అడుగు. (ఫూలే వచ్చారు)

పాటిల్ : నేను గతంలో చెప్పింది ఏమి నిర్ణయించావ్? (భయంగానే అడిగాడు)

ఫూలే : ఏది పిల్లల గురించేనా?

పాటిల్ : (కొంచెం ధైర్యం వచ్చింది) అవును. మీకు పెళ్లయి ఇన్నేళ్లయింది. మీ నాన్న కూడా మనవడ్ని చూడాలి చూడాలి అంటూ చూడకుండానే వెళ్లిపోయాడు. కాబట్టి నువ్వు ఊ అంటే మళ్లీ పెళ్లికి ఏర్పాట్లు చేసేస్తాను.

ఫూలే : ఊ అన్నాను. ఏర్పాట్లు చేసెయ్యండి.

పాటిల్ : చూసావా అమ్మా! ఒప్పేసుకున్నారు. సంబంధం దగ్గరిది చూడమంటావా? కాస్త దూరమైనా ఫర్వాలేదా?

ఫూలే : ఆ విషయం సావిత్రిని అడిగితే బాగుంటుంది.

పాటిల్ : అదీ నిజమే. ఇందులో ఆమె నిర్ణయాన్ని గౌరవిస్తే తర్వాతర్వాత గొడవలు రావు. ఏమ్మా! నీ అభిప్రాయం ఏంటీ?

సావిత్రి : నాదేముంది నాన్నా! ఆయనిష్టమే నా ఇష్టం.

పాటిల్ : మీ ఇష్టాన్ని ఆమె కాదన్నదెప్పుడు. మీరు చెబితినే సముచితంగా ఉంటుంది అల్లుడుగారూ.

ఫూలే : పెళ్లి చేసుకోబోయే వారిష్టం ముఖ్యం మామగారూ. ఆమెనడిగితేనే బాగుంటుంది.

పాటిల్ : పెళ్లి మీకండి.

**ఫూలే** : కాదు. ఆమెకే.

**పాటిల్** : మీకేమైనా మతిపోయిందా? భర్త బ్రతికుండగా భార్యకు మళ్లీ పెళ్లా.

**ఫూలే** : భార్య బ్రతికుండగా భర్తకు మరో పెళ్లా.

**పాటిల్** : పిల్లలు కావాలనుకున్నప్పుడు తప్పదు.

**ఫూలే** : భార్యకు చేస్తే పుట్టరా?

**పాటిల్** : గొడ్డుమోతుకు ఎలా పుడతారు.

**ఫూలే** : ఆమె గొడ్డుమోతని ఎవరు చెప్పారు.

**పాటిల్** : పిల్లలు కనలేని లోపం ఉన్న ఆడవాళ్లను అలాగే పిలుస్తారు.

**ఫూలే** : ఆలోపం మగాళ్లలో ఉండొచ్చుగా.

**పాటిల్** : ఉంటే ఉండొచ్చు కానీ, ఆడదానికి రెండో పెళ్లి చేయకూడదు.

**ఫూలే** : మగాడికి చేస్తున్నప్పుడు ఆడదానికి ఎందుకు చెయ్యకూడదంటాను.

**పాటిల్** : శాస్త్రం, సమాజం ఒప్పుకోదు.

**ఫూలే** : మగాడికైతే ఒప్పుకుంటుందా?

**పాటిల్** : భేషుగ్గా ఒప్పుకుంటుంది!

**ఫూలే** : ఆడదానికో నీతి – మగాడికో నీతా? ఇదెక్కడి ధర్మమండీ. ఇదిగోండి! మాకు పిల్లలు పుట్టకపోవడానికి లోపం ఆమెలో ఉందో, నాలో ఉందో మీకు తెలుసా. తెలీదు – మీరు మాత్రం నన్ను రెండో పెళ్లి చేసుకోమంటున్నారు. కానీ నేను సావిత్రికి చేస్తే బాగుంటుందనుకుంటున్నాను. కాబట్టి మీరు నిక్షేపంగా పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టండి. నేను అనుకున్న దానికి ఎవరైనా అడ్డం వస్తే...

**పాటిల్** : తెలుసు... తెలుసు... లోకమంతా కాళ్లతో నడుస్తుంటే చేతులతో ఎందుకు నడవకూడదనే మొనగాడివి. పదిమందీ దానితో కడుక్కుంటుంటే ఏం దీంతో ఆ పని చేస్తే తప్పేంటని అడిగే మొండివాడివి. తండ్రి దగ్గరకెళ్లి ఒరే నాయనా మాయమ్మను నువు జేసుకున్నావు. మీయమ్మను నేను జేసుకుంటే పొరపాటేంటని అడిగే ధైర్యమంతుడివి. నీకూ, నీ వాదనలకు, నీ సంస్కరణలకు, ఆలోచనలకు, అభిప్రాయాలకు శతకోటి నమస్కారాలు నువు మనిషివి కాదు... ఆ రూపంలో ఉన్న రాక్షసుడివి. నలుగురు చేత

ఓహో,ఆహో అనిపించుకోవాలనే ధ్యాస, పదిమందీ ఫూలే ఎంత గొప్పవాడని చెప్పుకోవాలనే ఆశ తప్పా! మంచి, మర్యాద, సంఘం, సంప్రదాయం ఏదీ పట్టని పాషాణానివి. ఇక్కడ అందర్నీ దబాయించేసి... ఇక్కడ గొప్పవాడివైపోవచ్చు - కానీ అక్కడ... అక్కడ తప్పదు అనుభవిస్తావు (విసురుగా వెళ్లిపోయాడు)

**సావిత్రి** : (తండ్రి తిట్లకు చలించిపోయింది) ఏవండీ! (అంటూ అతని గుండెల మీద వాలిపోయింది) ఈ రోజు నుండి మీకే కాదు నాక్కూడా తండ్రిలేనట్టే.

**ఫూలే** : సావిత్రీ నేనే అతన్ని నొప్పించానేమో.

**సావిత్రి** : లేదండీ! వాళ్లే మిమ్మల్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారు.. అపార్థం చేసుకుంటున్నారు.

**ఫూలే** : ఈ ప్రపంచంలో నువ్వు నాకుండగా ఎవరు అపార్థం చేసుకున్నా నాకేమీ కాదు. (ఆమెను తన గుండెల్లోకి తీసుకున్నాడు)

-LIGHTS OFF -

**వ్యాఖ్యానం** : అగ్రహారాల్లో అత్యాచారాలకు గురైన బ్రాహ్మణ వితంతువులు గర్భవతులై ఆత్మహత్యలకు పాల్పడేవాళ్లు. వీళ్ల సంఖ్య వందల్లో ఉండేది. అలాంటివాళ్లలో ఈ కాశీబాయి ఒకత్తే.

-LIGHTS ON-

## సన్నివేశం-11

(నీళ్లలో దూకి ఆత్మహత్య చేసుకోదల్చిన కాశీబాయిని రక్షించి ఇంటికి తీసుకువచ్చిన ఫూలే)

**ఫూలే** : (వస్తూ) సావిత్రీ! సావిత్రీ!... (బయట ఆగిపోయిన కాశీబాయితో) లోపలికి రామ్మా! ఫర్వాలేదు రా! ఇదీ నీ ఇల్లే అనుకో! (కాశీబాయి లోనకు వచ్చింది) కూర్చో భయపడకు. కూర్చో అమ్మా!... సావిత్రీ... ఆ! ఇప్పుడు చెప్పు. ఎందుకమ్మా నీళ్లలో దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు? (కాశీబాయి ఏడుస్తోంది) ఆ! ఆ! ఏడొవ్వద్దు... నేనున్నాను కదా! భయపడకు... (సావిత్రీ లోనుండి వచ్చింది)

**సావిత్రి** : సేఠ్‌జీ ఎవరీమె!

**ఫూలే** : ఈ అమ్మాయి నీళ్లలో దూకి ఆత్మహత్య చేసుకోబోతుంటే రక్షించి మనింటికి తీసుకు వచ్చాను.

**సావిత్రి** : (కాశీబాయి దుఃఖాన్ని చూసి) బాధపడకమ్మా! ఈ ఇంటి కొచ్చావుగా! ఇక నీకే బాధ ఉండదు.

**కాశీబాయి** : ఇది బాధ కాదమ్మా! నా జీవన్మరణ సమస్య. నాలాంటి వారికి బ్రతుకే కాదు చావు కూడా సమస్యే. చావలేక బతకమని నా నుదిటిన రాసాడమ్మా ఆ భగవంతుడు.

**ఫూలే** : మీరు బ్రాహ్మలమ్మా!

**కాశీబాయి** : అవును.

**ఫూలే** : మీరు బాలవితంతువా?

**కాశీబాయి** : అవును.

**సావిత్రి** : ఎవరింటి కోడలివి?

**కాశీబాయి** : అదీ.... అదీ....

**ఫూలే** : నువు ఎందుకు చనిపోవాలనుకున్నావ్? అదైనా చెబుతావా?

**కాశీబాయి** : (ఏడుస్తోందే తప్పా ఏవీ చెప్పలేకపోతోంది)

**ఫూలే** : పోనీ నీ పేరైనా చెబుతావా!

**కాశీబాయి** : చెబుతాను. తప్పకుండా చెబుతాను. నన్ను, నా కడుపులో ఉన్న నలుసుని కాపాడిన పుణ్యాత్ములు మీరు. మీకు అన్ని విషయాలు చెబుతాను. నా పేరు కాశీబాయి.

**సావిత్రి** : నీవు గర్భవతివా!

**కాశీబాయి** : అవునమ్మా! ఈ దురాగతానికి కారణం నా స్వంత బావగారే.

**సావిత్రి** : తండ్రిలా అండగా నిలవాల్సిన బావ ఇంత పన్జేసాడా!

**కాశీబాయి** : అవునమ్మా! ఇది బయటపడే సరికి నాకే సంబంధం లేదని పరాయి వాళ్లందరితోను రంకు కడుతున్నాడమ్మా!... ఆఖరికి పాలవాడితోనూ, నీళ్లవాడితోనూ... అందుకే చచ్చిపోవాలనుకున్నాను.

**సావిత్రి** : చచ్చి ఏం సాధిస్తావు చెప్పు.

**కాశీబాయి** : ఏం చెయ్యను. ఈ పూనా మహానగరంలో ఫూలే అనే మహానుభావుడు మాలాంటివారికి ఆశ్రయమిస్తున్నారని విన్నాను. కానీ అతనెక్కడుంటారో! ఎలా వెళ్లాలో తెలియదు... ఒక ప్రక్క గర్భం...మరో ప్రక్క మా బావ ఈసడింపులు. ఏం చెయ్యాలో తెలియక జీవితాన్ని ముగించాలనుకున్నానమ్మా.

**సావిత్రి** : ఇప్పుడు నీకా అవసరం లేదు. అదిగో నువు కలవాలనుకున్న పూలే గారు.

**కాశీబాయి** : మీరా! మహాత్మా! మీరా నన్ను రక్షించి... అంటే మీరు సావిత్రీబాయి...

**సావిత్రి** : అవునమ్మా! నేనే సావిత్రి బాయిని. ఇక నువు నిశ్చింతగా నీ కిష్టమైనంత కాలం ఇక్కడే ఉండొచ్చు.

**కాశీబాయి** : ఆహా! నేనెంత అదృష్టవంతురాలిని. భగవంతుడా! ఇలాంటి క్లిష్ట సమయంలో ఇంత గొప్ప ఆశ్రయాన్ని కల్పించారా! అమ్మా! నాకిప్పుడు నిండు నూరేళ్లు బ్రతకాలని ఉంది. (అంటూ సావిత్రిబాయి భుజం మీద వాలిపోయింది)

-LIGHTS OFF-

**వ్యాఖ్యానం** : కాశీబాయి ఒక మగబిడ్డకు జన్మనిచ్చి పన్నెండు రోజుల తర్వాత ఆ బిడ్డను వదలి ఎటో వెళ్లిపోయింది. తాము ఆ జన్మాంతం ఏ బ్రాహ్మణులకైతే వ్యతిరేకంగా పోరాడారో ఆ బ్రాహ్మణుల అక్రమ సంతానాన్ని తమ కొడుకుగా దత్తత తీసుకున్నారు పూలే దంపతులు. అతడే డాక్టర్ యశ్వంత్‌రావు పూలే. పూలే వీలునామా వ్రాసినప్పుడు ఎంత కాలమైతే అణగారిన కులాలకు సేవ చేస్తారో అంత కాలమే యశ్వంత్‌రావు తన వారసుడని ప్రకటించాడు పూలే. అది 1873 – అణగారిన కులాల విమోచనా సంస్థ అనదగిన సత్యశోధక సమాజం ప్రారంభించిన సంవత్సరం అది.

-LIGHTS ON-

## సన్నివేశం-12

(లోఖండే, భాలేకర్, రామయ్యవెంకయ్య అయ్యవారు, జ్యోతిబాపూలే, సావిత్రి, మార్తాండ్)

**రామయ్య** : మన సత్యశోధక సమాజం రూపురేఖలు యెట్లా వుండాలో తీవ్రంగా చర్చించాలి. జ్యోతిబా – దీనికి సంబంధించి వొక ముసాయిదా ప్రణాళిక తయారు చెయ్యాలి.

**లోఖండే** : బ్రాహ్మణభట్టులు కల్పించిన కట్టుకథలు, మూఢ నమ్మకాల నుంచి అణగారిన కులాల బిడ్డలను విముక్తి చెయ్యడం మీదే మనం దృష్టి పెట్టాలి.

**భాలేకర్** : బ్రిటిష్ వాళ్లను వ్యతిరేకించడం మీద కూడా మనం వొక తీర్మానం చెయ్యాలి. అందుకోసం మనం బ్రాహ్మణ భట్టులతో కలిసి పోరాడాల్సి వస్తే కలిసి పోరాడుదాం.

**ఫూలే** : నిజమే గాని ఈ అగ్రకులాలు వాళ్ల పక్కన మనల్ని నడవనివ్వనే నడవనివ్వరే. యింక వాళ్లతో కలిసి పోరాడడమే వూహించలేం. ఈ బ్రిటిష్ వాళ్లు పాలిస్తూ వుండగానే మనం కులదాస్యం నుంచి బయటపడాలి.

**భాలేకర్** : మీ మాటను నేను కూడా అంగీకరిస్తున్నా, కుల వ్యవస్థే మన ప్రథమ శత్రువు. (అందరూ చప్పట్లు)

**ఫూలే** : మన పోరాటాన్ని అవమానించడానికి మనం బ్రిటిష్ వాళ్ల తొత్తులని కూడా ప్రచారం చేస్తారు. ఇప్పుడు నా ఇల్లు కాలుతోంది, నా ఒళ్లు కాలుతోంది. ముందుగానేను దేన్ని ఆర్పుకోవాలి. ఒళ్లే ఆర్పుకోవాలి. నేను జీవించి ఉంటే కదా నాకు ఇల్లు అవసరం. ఈ కుల వ్యవస్థలో అణిగిపోకుండా మన మానాభిమానాలు, ప్రాణాలు కాపాడుకోవాలి. కనుక మనం జీవించి ఉండడమే ముఖ్యం.

**ఫూలే** : అయితే యిదిగోండి (కాగితం యిస్తాడు) సత్యశోధక సమాజ్ ప్రతిజ్ఞ రాశాను. మార్పులూ చేర్పులూ వుంటే చెప్పండి. సావిత్రీ నువ్వు కూడా చూడు. (అందరూ ఒకరి తర్వాత ఒకరు చూశారు)

**రామయ్య** : బ్రాహ్మణ భావజాలాల్ని యింత తీవ్రంగా వ్యతిరేకించాలంటే మనతో అన్ని కులాల వాళ్లూ కలిసిరావాలి.

**భాలేకర్** : సమాజం మీదా ప్రజల మీదా నీకున్న నమ్మకం చూస్తే నాకు చాలా ఆశ్చర్యంగా వుంది ఫూలే. మన వెనుకబడిన కులాలు చాలా పిరికితనంతో వుంటాయని గుర్తు పెట్టుకోవాలి.

**ఫూలే** : అవును. రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లు. బ్రాహ్మణ వితంతువులకు శిరోముండనం చెయ్యకూడదని మనం నిర్ణయించినంత మాత్రాన సరిపోదు. వాళ్లకు క్షవరం చేసే మంగలి వాళ్లు కూడా మనతో కలిసిరావాలి. వాళ్ల సహాయం మనకు కావాలి.

(మార్తాండ్ ప్రవేశిస్తాడు)

**మార్తాండ్** : జ్యోతిబా... జ్యోతిబా.....

**పూలే** : రా మార్తాండ్... నీకు నూరేళ్లు. నీ గురించే అనుకుంటున్నాం.

**లోఖండే, భాలేకర్, రామయ్య** : బాగున్నావా మార్తాండ్.

**మార్తాండ్** : వొహో - అందరూ యిక్కడే వున్నారా? లోఖండే, భాలేకర్, రామయ్యవెంకయ్య అయ్యవారూ. నమస్తే... నమస్తే... జ్యోతిబా నేను చిన్నమాట చెప్పి పోదామని వచ్చాను. మీరు చెప్పినట్టు అన్ని వూళ్లలో మా మంగళి వాళ్లకి చెప్పేశాను. మేం మొత్తం వెయ్యిమంది వున్నాం. మేం పూనా నగరంలో వూరేగింపు చేస్తున్నాం. భర్త పోయి విధవరాండ్రులైన బ్రాహ్మణ స్త్రీలకి మేము గుండు కొట్టేది లేదు. తీర్మానం అయిపోయింది. మీ ఉద్యమానికి మా మద్దతు. పనులు చాలా వున్నాయి వస్తాను.

**పూలే** : మార్తాండ్.... వొక్క విషయం. ఈ కాగితం వొక్కసారి చూసి నీ అభిప్రాయం చెప్పు. (కాగితం చదివి ఆవేశంతో మంగలి మార్తాండ్ ప్రతిజ్ఞ చేస్తాడు. అందరూ అతనితో గొంతు కలుపుతారు)

సత్యశోధక సమాజ్ ప్రతిజ్ఞ :

మనది సత్య శోధక సమాజం. మన పోరాటం సత్యాగ్రహం. మానవులంతా వొకే దేవుడి బిడ్డలు. తల్లిదండ్రుల ప్రేమను పొందడానికి మధ్యవర్తి గానీ బ్రోకర్ గానీ యెలాగ అవసరం లేదో... ఆ భగవంతుడి ప్రేమను పొందడానికి కూడా పూజారులూ, మత గురువులూ, బ్రోకర్లూ అక్కర్లేదు. అందువల్ల నా యింట్లో జరిగే యే శుభకార్యానికి గానీ, పెళ్లి పేరంటాలకు గానీ, చావు తద్దినాలకు గానీ నేను యే బ్రాహ్మణ భట్టునీ నా యింటికి పిలవను. నా పిల్లల్ని చదివించడం మానను. యిదే నా ప్రతిజ్ఞ.

**భాలేకర్** : ఈ సత్యశోధక సమాజానికి నా వంతు విరాళంగా ప్రతి నెలా వొక పావలా యిస్తాను. యిదిగో నా మొదటి పావలా.

**పూలే** : పావలా అంటే బస్తా బియ్యం. (జోలెపట్టి) మన స్కూల్లో పిల్లలకి యెంతో ఉపయోగపడతాయి. పదిరోజుల భోజనం.

**రామయ్య** : నాది అర్ధ రూపాయి!

**పూలే** : (జోలె పట్టాడు)

**లోఖండే** : నేను ప్రతినెలా వొక రూపాయి యిస్తాను.

**పూలే** : అంటే తులం బంగారం.

**మార్తాండ్** : మిమ్మల్ని మహాత్మా అని పిలవడం కన్నా నేనేమి యివ్వలేను (పూలే కౌగిలించుకున్నాడు)

LIGHTS OFF - LIGHTS ON

## సన్నివేశం-13

**(బ్రాహ్మణవీధి)**

**కులకర్ణి** : ఆ పూలేని చూస్తే ఉగ్రనర్సింహుని చూసినట్టు గుండెలదురుతున్నాయి. సత్యశోధక సమాజాన్ని స్థాపించాడు. ఎడాపెడా మన మీద పుస్తకాలు రాస్తున్నాడు. మన తప్పుల్ని వేలెత్తిచూపడం, మనల్ని నిందించడమే ధ్యేయంగా పెట్టుకున్నాడు. వేదం చదవడానికి కులంతో పనిలేదు. అందరికీ ఆ అర్హత ఉందట.

**భట్టు** : అవునౌను. "గులాంగిరి" అనే పుస్తకాన్ని రాసి తగలడ్డాడు. అందులో మనమీద ఎంతేసి నిందలేసాడు. ఎంత కటువుగా దాడి చేసాడు.

**కులకర్ణి** : శాస్త్రాల్లో ఏవుంది? బ్రాహ్మణుడి కుడికాలిలో సకల పుణ్యక్షేత్రాలున్నాయని ఉందా? ఆ కాలు ముంచిన నీరు సమస్త పాపాల్ని కడిగేస్తుందని ఉందా? కానీ ఈ పూలే కూతలెలా ఉన్నాయి. ఆ నీళ్లు మురికి కాలువలోని నీళ్లతో సమానమా! ఛీ!ఛీ!ఛీ! మరీ తీసికట్టు నాగంభొట్లు వ్యవహారమైపోయింది మన పరిస్థితి.

**భట్టు** : (సంచిలోంచి తీసి) ఇదిగో ఇది చదవండి. శూద్రపు ముండాకొడుకు ఎలాంటి ఘోరాలకి తలపడుతున్నాడో!... వీడి శ్రాద్ధం పిల్లులకి పెట్ట.

**కులకర్ణి** : (పేపరు తీసుకొని) ఏవిటిదీ! రండా గర్భాలు చేయించుకుంటే, నిర్భయంగా మా ఆశ్రమానికి రండి. నేనూ నా పెళ్లాం కలిసి పురుడులు పోస్తామని పోస్టర్ వెయ్యించాడండి... పాపిష్టి వెధవ.

**భట్టు** : వీళ్లంతా కలిసి ఈ దేశాన్ని ఏం చెయ్యనున్నారో. ఇంతకు ముందు మనది ఒకటే సమాజం. అది హిందూ సమాజం. ఇప్పుడేమిటండీ ఈ వింత. బ్రహ్మ సమాజమట. ప్రార్థనా సమాజమట. సత్యశోధక సమాజమట.

**కులకర్ణి** : మన సమాజం ఇన్నింటిగా చీలిపోవాలనే ఈ ఇంగ్లీషు వాళ్ల ఎత్తుగడ. దాని ప్రకారమే మనలో మనకి బేదాభిప్రాయాల్ని రెచ్చ గొడుతున్నారు. వాళ్ల సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారు.

**భట్టు** : ఈ మ్లేచ్ఛపు వెధవల తలకాయలు చిన్నవి కావు. వాళ్ల ఉచ్చుల్లో పూలే లాంటి పొగరుబోతులు చాలా తేలిగ్గా పడిపోతారు. చూసారా విడ్డూరం! వీడికేమో ఆర్యులంటే పడదు. ఆ గులాంగిరి నిండా ఆర్యుల్ని తిట్టిపోశాడు. కానీ ఆర్య సమాజం వాడైన దయానంద స్వామి పూణె వస్తుంటే మాత్రం పూలే పుంజాలు తెంపుకొని వెళ్లి మరీ ఆహ్వానం పలుకుతాడట.

**కులకర్ణి** : వెధవ! కపటంలో మనల్ని మించిపోతున్నాడు. అందుకేనండి, ఎవరికి బడితే వారు చదువులు చదువుకూడదని నిషేదించింది. మన పూర్వీకులు మన శ్రేయస్సుని ఎంతగా ఆలోచించారని.

**భట్టు** : మనమే చేతులు ముడుచుకుని మరీ చోద్యాలు చూస్తున్నాం. కానివ్వండి ఏమి జరగనుందో. (ఒక పురోహితుడు వచ్చాడు)

**పురోహితుడు** : ఏమి జరగనుందో అని దీర్ఘాలు తియ్యకండి. మన వైభవం కాస్తా గాలికి కొట్టుకుపోబోతుంది. ఒక పెళ్లి జరిపించామంటే మనకో ఆర్నెళ్లు గడిచిపోతుందా. పెళ్లి పేరంటాల్లో అంతేసి తంతులు పెట్టామంటే దాని లక్ష్యం ఏమిటీ? ఈ సంఘం మనల్ని అలక్ష్యం చెయ్యకూడదనేగా... సరిగ్గా ఆ పూలే మన ఆయువుపట్టి చూసి అక్కడ కొట్టాడు దెబ్బ.

**భట్టు** : ఏమైందీ!

**పురోహితుడు:** ఏమౌతుంది? తన దుకాణంలో పన్జేసే ఒక బంధువుకి బ్రాహ్మణల్లేకుండా పెళ్లి చేయబోతున్నాడు. పెళ్లిళ్లనేవి మనం లేకుండా ఎవడికి వాడు చేసేసుకుంటే ఇక మనకి మనం తద్దినాలు పెట్టుకోవాల్సిందే.

**ఇద్దరు** : మనం లేకుండా పెళ్లిళ్లా???

**పురోహితుడు** : అవునండీ

**కులకర్ణి** : ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదు.

**భట్టు** : దీన్ని ససేమిరా మనం ఒప్పుకోకూడదు.

**కులకర్ణి** : ఆ పెళ్లిని ఎలాగైనా ఆపాలి. పదండి వాడి అంతు చూద్దాం.

## సన్నివేశం-14

### (సత్యశోధక సమాజం ఆఫీసు)

(ధోండిబా గులాంగిరి పుస్తకాన్ని ఎంతో ఆరాధనగా చూస్తూ ఉన్నాడు)

**పూలే** : ఏంటలా చూస్తున్నావు?

**ధోండీబా** : ఈ గులాంగిరిలో నా పేరు కూడా రాసారు.

**పూలే** : అవును.

**ధోండీబా** : ఎందుకు జ్యోతిబా నా పైన అంత ప్రేమ.

**పూలే** : ఇది కేవలం ప్రేమ కాదు.

**ధోండీబా** : మరి.

**పూలే** : నువ్వూ నేను వేరు కాదు. మనం గమనానికి, గమ్యానికి ప్రతిరూపాలం. గమనం నేనైతే, గమ్యం నువ్వు.

**ధోండీబా** : నాకర్థం కాలేదు.

**పూలే** : అవుతుంది. అంకితం చదువు.

**ధోండీబా** : Dedicated to the good people of United States as a token of admiration for their sublime disinterested and self scarifying devotion in the cause of negro slavery; and with an earnest desire.

**పూలే** : అలా... నీగ్రోల బానిసత్వ విమోచనానికి కృషి చేస్తున్న సజ్జనులను ఆదర్శంగా తీసుకొని మన దేశంలోని శూద్రుల్ని ఈ బానిసత్వం నుండి విమోచనం కలిగిస్తారని భావిస్తున్నాను.

**ధోండీబా** : ఎందుకు జ్యోతిబా ఈ నిర్భాగ్యుల పట్ల మీకింత ఆరాటం.

**పూలే** : హోమర్ అన్నట్టు బానిసత్వం మనిషిలోని గొప్ప గుణాల్ని హరించి వేస్తుంది. పరిపూర్ణ మానవత్వం వికసించాలంటే స్వేచ్ఛ కావాలి. ఈ బ్రాహ్మణ భావజాలం నుండి ఈ దేశ ప్రజలు విముక్తి చెందే వరకు ఈ నేలపై స్వేచ్ఛా వాయువులు ప్రసరించవు.

**ధోండీబా** : ఆ! నాకిప్పుడు గుర్తుకొస్తుంది. ఇందులో ఉన్న కొన్ని భాగాల్ని ఒక పత్రికకు పంపారు. ఏంటా పత్రిక పేరు.

**పూలే** : "లోక కళ్యాణేచ్ఛ"

**ధోండీబా** : అవునవును.

**పూలే** : ఆ పత్రిక వాళ్లు తిరిగి ఏమి రాసారో అది గుర్తుందా?

**ధోండీబా** : ఓ! "విద్యావంతుడు, వివేకవంతుడు, ఉదారభావాలు కలవాడు గొప్ప పరిశోధన ఉత్తరం పంపాడు. దాని నిండా ఆత్మ ప్రశంస, బ్రాహ్మణ నిందా ఉన్నాయి. అది ప్రచురించడానికి మా పత్రికలో చోటులేకపోయింది. పూలే మమ్మల్ని క్షమిస్తాడని ఆశిస్తున్నాం" – అని రాసారు.

**పూలే** : అందుకే ఆనాడు నేను రాసిందానికి మరింత జోడించి దీన్ని గ్రంథంగా వేసాం. ఇప్పుడెలా వాళ్లు నా భావాల్ని అడ్డుకోగలరు. నేను ప్రతిపాదించిన చారిత్రక సిద్ధాంతాలనెలా చీకటిలోనే మగ్గించగలరు. వాళ్లు ఇన్ని తరాలుగా సాంద్రీకరించిన కపటమాయోపాయం మత కర్మలను, వర్గ శ్రేయస్సుతో రూపొందిన ధర్మాలను నేను వెయ్యి గొంతుకలతో ప్రశ్నిస్తుంటే ఎలా జవాబివ్వగలరో చూద్దాం. (సావిత్రి వచ్చింది)

**సావిత్రి** : ఏంటండీ అంత ఆవేశంతో ఉన్నారు.

**పూలే** : ఇది ఆవేశం కాదు. గులాంగిరిలో నేను లేవనెత్తిన ప్రశ్నలకు జవాబివ్వలేక పురోహితులెలా నీళ్లు నములుతున్నారో దోండికి చెబుతున్నాను.

**సావిత్రి** : మీలో ఎంత ఆనందం కనిపిస్తుంది. అమెరికాలో నీగ్రోలకు విముక్తి కలిగిన రోజున తల్లులు, పిల్లలు, భార్యలు, భర్తలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఒకరితోనొకరు కలుసుకొని ఎంత ఆనందించారో అంత ఆనందం మీ ముఖంలో కనిపిస్తోందండీ!

**పూలే** : నిజమే సావిత్రీ! చరిత్రంతా విజేతల పరంగానే రాయబడింది. వీరులైన దేశీయ రాజుల్ని ఓడించి ఈ దేశాన్ని కైవసం చేసుకున్నారు. దండయాత్రల పరంపరను కొనసాగించి విజేతులైన ఆర్య నాయకుల్ని దేవుళ్లుగా మార్చి మన నెత్తిన కూర్చోబెట్టారు.

**సావిత్రి** : అదెలా

**పూలే** : అహంభావం, గర్వం, స్వార్థం మూర్తీభవించిన తెగ ఒకటి భారతదేశం పైన దండెత్తింది. ఆ దాడిని ఎదుర్కొన్నారు క్షత్రియులైన శూద్రులు, అతిశూద్రులు. వారెంతో పరాక్రమవంతులు. కానీ యుద్ధంలో ఓడిపోయి ఒక్కోతరానికి కొంతమంది చొప్పున బానిసలౌతూ వచ్చారు. వారిలో బలి

ప్రముఖమైనవాడు. బలిని ఓడించిన వామనుడు కుటిలుడు. వాడి తరపున వకాల్తా పుచ్చుకొని దేవుడ్ని చేసారు. దేశీయ క్షత్రియులందర్నీ చంపిన పరశురాముడు మరొక అవతార మూర్తి అయ్యాడు. ఇలా ఎన్నో కట్టు కథలతో మన కళ్లను కట్టేసారు. నిజాన్ని చూడకుండా పుక్కిట పురాణాల అద్దాలు మన కళ్లకు తగిలించారు. అవన్నీ నిజమనుకుని, మన శత్రువుల్నే భక్తితో, భయంతో మనం ఈరోజు పూజిస్తున్నాం. ఇంతటి దుర్గతి ప్రపంచంలో ఇంకెక్కడైనా ఉందా? (బయట నుండి యశ్వంత్ అమ్మా అంటూ వచ్చాడు – అతనికి పదేళ్లుంటాయి)

**పూలే** : ఆ ధోండీబా! ఈ రోజు సత్యశోధక సమాజ సూత్రాలననుసరించి ఒక వివాహం జరపబోతున్నాం. వధూవరులకు ఏ ఇబ్బంది లేకుండా వారినిక్కడకు తీసుకురా. (ధోండీబా బయటకు వెళ్లాడు)

**సావిత్రి** : ఏవండీ! యశ్వంత్ ఇప్పుడు మీకన్న చక్కగా ఉపన్యాసాలివ్వగలడు తెలుసా.

**పూలే** : ఏరా నిజమా!

**యశ్వంత్** : నిజం నాన్నగారు.

**సావిత్రి** : సత్యశోధక సమాజం స్థాపించినప్పుడు నాన్నగారిచ్చిన ఉపన్యాసాన్ని చెప్పు నాన్నా?

**యశ్వంత్** : చెప్పమంటారా నాన్నగారూ.

**పూలే** : ఏది చెప్పు వింటాను.

**యశ్వంత్** : (తన ముందు ప్రేక్షకులు ఉన్నట్టు నటిస్తూ) మిత్రులారా! అందరికీ నమస్కారం. ఎన్నో తరాల తరబడి సాంద్రీకృతమైన ఒక దుర్మార్గపు వ్యవస్థలో ఉన్నాం. ఆ వ్యవస్థలకు పునాదులు అసత్యం, మోసం, దోపిడి. దాన్ని బ్రద్దలు కొట్టడం మన ముందున్న లక్ష్యం. ఆ లక్ష్యాన్ని సాధించడానికి ఓ సంస్థ అవసరం అనిపించింది. చీకటిని వెలుగుతోను, అసత్యాన్ని సత్యంతోను జయించాలి. అందుకే ఈ సంస్థకు సత్యశోధక సమాజమని నామకరణం చేస్తున్నారు. ఈ సత్యశోధక సమాజానికి మూడు సూత్రాలున్నాయి. ఈ సమాజ సభ్యులు ఈ మూడు సూత్రాల్ని తప్పకుండా పాటించాలి. ఒకటి సత్యానికి రూపమైన దేవుడు ఒక్కడే. ఆ దేవుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. అతడు నిరాకారుడు, నిర్గుణుడు. ఆ దేవుని దృష్టిలో మానవులంతా ఒకటే. ఒకడు ముఖంలోంచి, మరొకడు

భుజంలో నుండి, ఇంకొకడు తొడల్లోనుండి, వేరొకడు పాదంలో నుండి పుట్టాడనడం నిజంకాదు. మానవులంతా అతని హృదయంలోంచి పుట్టిన వారే.

రెండవ సూత్రమేమిటంటే, ప్రతి మనిషికి దేవుని పూజించే అధికారం, హక్కు ఉన్నాయి. దేవుని కృపకు ఎవరూ బహిష్కృతులు కారు. దేవునికి మనిషికి మధ్య మరో వ్యక్తి అవసరం లేదు. అది పురోహితుడు కానివ్వండి, ముల్లా కానివ్వండి, ఫాదర్ కానివ్వండి. వీళ్లంతా దేవుని నుండి మనిషిని దూరం చేసే వాళ్లే తప్ప దగ్గర చేసే వాళ్లు కాదు. మన తల్లిని మనం గౌరవించుకోవాలంటే మధ్యలో మరో మనిషి ప్రమేయం అవసరమా? మన తండ్రిని మనం పూజించుకోవాలంటే ఇంకొకరి సహాయం కావాలా? అక్కర్లేదు. అలాగే దేవుడ్ని మనకు మనంగానే పూజించుకుందాం. అందుకు పురోహితుల అవసరం ఎంత మాత్రం లేదు. ఇక చివరి సూత్రం – ఈ భూమిపై జన్మించిన ఎవరు కూడా కులం వలన గోత్రం వలన గొప్పవారు కాలేరు. కేవలం గుణంతోనే గొప్పవాళ్లు అవుతారు. (పూలే, సావిత్రమ్మ ఆనందంతో చప్పట్లుకొట్టి, యశ్వంత్‌ని ఎత్తుకున్నారు. అప్పుడే బయట నుండి వధూవరుల్ని తీసుకొని ధోండీబా వచ్చారు – వాళ్లతో మరికొంత మంది ఉన్నారు)

**ధోండీబా** : జ్యోతిబా! ఇదిగో వధూవరులు.

**పూలే** : కఠోరమైన సంప్రదాయాన్ని కాదని ఈ ఆదర్శ వివాహానికి మీరు ముందుకు వచ్చినందుకు చాలా సంతోషం – ఏది మీరిద్దరూ ప్రమాణం చెయ్యండి. 'సత్యనిష్టతో ఈమెను నేను భార్యగా స్వీకరిస్తున్నాను"

**పెళ్లికొడుకు** : సత్యనిష్టతో ఈమెను నేను భార్యగా స్వీకరిస్తున్నాను. (పురోహిత వర్గం వచ్చింది)

**భట్టు** : వీల్లేదు. ఈ పెళ్లి చెల్లదు.

**కులకర్ణి** : ఇది శాస్త్రాలకు, సాంప్రదాయాలకు విరుద్ధంగా జరుగుతున్న పెళ్లి.

**భట్టు** : ఏమర్రా! అతను పిలవగానే పరుగెత్తుకొచ్చారు. మీకెవరికీ తలకాయలు పన్జెయ్యట్లేదా? భార్య అంటే భర్తకు ధర్మార్థకామ మోక్షాలలో విధేయురాలై ఉండాలి. (పెళ్లికొడుకుతో) ఏవయ్యా పెళ్లికొడకా! పంచభూతాల సాక్షిగా, పేరంటాల సాక్షిగా, పురోహితుని సాక్షిగా పెళ్లి చేసుకున్న ఆడదే ఒక్కోసారి సరిగ్గా కాపురం చెయ్యదు. అలాంటిది, ఇదేమీ లేకుండా ఎవడో ఏదో

చెప్పాడని ఈవిడ్ని పెళ్లి చేసేసుకుంటే ఆ తర్వాత నిన్ను వదిలి పెట్టి ఎవడితోనో వెళ్లిపోతే ఏంజేస్తావ్?

**పెళ్లికొడుకు** : (కంగారుపడ్డాడు)

**భట్టు** : ఈ ప్రశ్న ఇతన్నే కాదు. మిమ్మల్నందర్నీ అడుగుతున్నాం. జవాబు చెప్పండి ఈ పెళ్లికున్న పవిత్రత ఏమిటి?

**పూలే** : చూడండి! భార్యభర్తలు ఒకరికొకరు విధేయులై ఉండడమనేది మనసుకి సంబంధించిన విషయం, ఇష్టంలేని వారి చేత ఏ మంత్రాలు కాపురం చెయ్యించలేవు. ఏ బ్రాహ్మడు వారి సంసారాన్ని నిలబెట్టలేడు. మర్యాదగా చెబుతున్నాను, మా ఆదర్శ వివాహానికి అడ్డురాకండి... ప్రక్కకు తప్పుకోండి.

**భట్టు** : ఇదిగో నిన్ను అడిగేవాడు, అడ్డగించేవాడు లేడని చాలా చాలా మితిమీరుతున్నావు. చూస్తారేం...ఆ జంటను విడదీసి ఎవరిళ్లకు వాళ్లను పంపెయ్యండి. (కొంతమంది గూండాలు ముందుకురికారు. అది చూసి అక్కడే ఉన్న మహర్లు, మాంగులు అడ్డుతగిలారు. వారిలోంచి కృష్ణారావు భాలేకర్ ముందుకొచ్చాడు)

**కృష్ణారావు** : ఆగండి!

**భట్టు** : ఇదిగో కృష్ణారావు భాలేకర్. నువ్వింక యువకుడివి ఇందులో కలుగచేసుకోవడం నీకు మంచిదికాదు.

**కృష్ణారావు** : జ్యోతిబాపూలే నడుపుతున్న ఉద్యమం మా యువకులకు ఆదర్శప్రాయం. ఆయన మా పాలిట వేగుచుక్క.

**భట్టు** : మీ ఖర్మ! మిమ్మల్నందర్నీ తీసుకెళ్లి కిరస్తానీ మతంలో కలిపేస్తాడు.

**కులకర్ణి** : ఇతడు ఇంగ్లీషు వాళ్ల ఏజెంటు. ఈ దేశాన్ని, హిందూ ధర్మాన్ని ఇక్కడి సంప్రదాయ సంస్కృతుల్ని మంటగలపడానికి వచ్చిన చీడపురుగు.

**కృష్ణారావు** : దీనుల్ని హీనుల్ని ఉద్ధరించడానికి అవతరించిన దేవుడాయన. అట్టడుగు వర్గాల కోసం తన సుఖాన్ని జీవితాన్ని అర్పించిన త్యాగశాలి ఆయన. అతన్ని నిందించడం కాదు కదా, కన్నెత్తి చూసే అర్హత కూడా మీకెవరికీ లేదు. ఇంకొక్కమాట ఎక్కువ వచ్చిందో, మీలో ఎవరూ ప్రాణాల్తో వెళ్లరు. మర్యాదగా పొండి బయటకు.

LIGHTS OFF

**వ్యాఖ్యానం :** సత్యశోధక సమాజ్ ప్రారంభించిన "బ్రాహ్మణుల తంతులేని స్వాభిమాన వివాహ పద్ధతి" భారతదేశాన్ని ఒక్క కుదుపు కుదిపింది. 1876 నుండి 82 వరకు జ్యోతిబాపూలేను పూనా మున్సిపల్ కార్పోరేషన్ మెంబరుగా ప్రభుత్వం నియమించింది.

1877 సంవత్సరంలో అతి పెద్ద కరువు వచ్చింది. పిల్లలు ఆకలితో అల్లాడుతుంటే అది చూసి భరించలేని తల్లిదండ్రులు వారికి విషమిచ్చి చంపేసిన సందర్భాలున్నాయి. అటువంటి సమయంలో పూలే దంపతులు పేద ప్రజలకు అండగా నిలబడ్డారు. అందరికీ రొట్టెలు ఇచ్చి వారికి ప్రాణదానం చేసారు.

జ్యోతిబాకు ఇప్పుడు 60 ఏండ్లు. అయినా అతనిలో పోరాటపటిమ ఇంకా సన్నగిల్లలేదు. వ్యవస్థపై అతను సంధించిన ధిక్కార స్వరం జీరబోలేదు. 1888 సంవత్సరంలో రాజకుమారుడు డ్యూక్ ఆఫ్ కన్నాట్ పూనాకు వచ్చినప్పుడు, అతని సమక్షంలోనే పూలే నిర్భీతి, సత్యసంధత మరింత విజృంభించి వెలుగులోకి వచ్చాయి.

-LIGHTS ON-

## సన్నివేశం-15

ఎత్తైన సింహాసనం మీద డ్యూక్ రాకుమారుడు కూర్చొని ఉన్నాడు. హరిలాల్ జీ ఇంట్లో ఏర్పాటు చేసిన విందు అది. రాకుమారుని చుట్టూ అనేక మంది ఉన్నారు. వారి మధ్యలో జ్యోతిరావు పూలే ఎంతో సాధారణమైన దుస్తుల్లో ఉన్నారు. మోకాళ్ల వరకు దిగిన ముతక పంచె, తలకు పెద్ద పాగా, మామూలు చొక్కా, ఎడమ భుజం మీద గొంగడి, చేతిలో కర్ర, కాళ్లకు తోలు చెప్పులు వేసుకొని ఉన్నారు.

**స్వాగతం పలికే వ్యక్తి :** మహారాజు కుమారునికి పూణె నగరం తరపున భారతదేశం తరపున మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతున్నాం. ఇంగ్లీషు వాళ్ల రాజ్యంలో ప్రజలెంతో సుఖ సంతోషాలతో ఉన్నారు. న్యాయమైన మీ పాలనలో అందరూ ఆనందంగా ఉన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం వర్థిల్లు గాక. మా దేవత దీనుల పాలిట కరుణామూర్తి అయిన విక్టోరియా రాణిగారికి వందనాలు. ఇప్పుడు జ్యోతిరావు పూలేని మాట్లాడవలసిందిగా కోరుతున్నాము.

పూలే : Your Highness and the Duke of Connaught, Good Morning to you! I take this opportunity to pay respects to your grand mother Queen Victoria of England. ఇప్పుడు మీరు విన్నదంతా నిజం కాదు. మీరు చూస్తున్నదీ నిజం కాదు. ఇక్కడున్న కొందరు పెద్దలు ధరించిన దుస్తుల్ని, ఆభరణాల్ని చూసి భారతీయులంతా ఇలాగే సంపదలతో తులతూగుతున్నారని భ్రమించకండి.

They are not the representatives of the peasants who constitute the major portion of the population from the Villages. The real India is seen in villages where people are penniless, foodless and shelter less. The majority do not have even rags to hide their shame. If your royal Highness wants to see True India, your Majesty should go to some near by villages - there -

అక్కడ పశువుల కన్నా హీనంగా మహర్లు, మాంగులు దర్శనమిస్తారు. కడుపులోని ఆకలి మంటలను ఆర్పాలనే ఆశతో ఏదీ దొరక్క గాలిని మింగుతున్నారు. ఆ మంట ఆరకపోగా అది రెట్టింపు అవుతోంది, కనీసం గుక్కెడు నీళ్లతోని దాన్ని చల్లబర్చుకుందామంటే ఆ నీళ్లు కూడా దొరకడం లేదు. ఇక గత్యంతరం లేక మట్టిని మ్రింగుతున్నారు. మట్టిని తిన్న మనిషి శరీరం మట్టిలోకి, ప్రాణం ఆకాశంలోకి వెళ్లిపోతున్నాయి. పంచభౌతికమైన మనిషి చివరకు పంచభూతాత్మకమైన ప్రకృతితో సాధించే గొప్ప సమన్వయాన్ని మీరు ప్రతీ పేదవాడింటిలోను ఆకలిచావుల రూపంలో చూడగలరు. Your Highness - this is real India. The true representative of India is not the rich and glittering gentleman but it is the Mahar or Mang and a poor feeble peasant on a farm. Your Majesty! the soul of India lies not in the towns and cities but in the villages.

- LIGHTS OFF -

**వ్యాఖ్యానం** : ఒక ప్రక్క సమాజ సేవ చేస్తూనే, తన గుండెలోని స్పందనలకు అక్షరాల ఆకృతినిచ్చి, ఎన్నో గొప్ప గ్రంథాల్ని రచించారాయన. శివాజీ వీరగాథ, బ్రాహ్మణుల కుట్ర, గులాంగిరి, సేద్యగాని చర్నాకోలా, సత్సార్ – ఇలా, ఈ గ్రంథాల్లోని ప్రతీ అక్షరం అభాగ్యుల కోసం ఆ పుణ్యాత్ముడు కార్చిన కన్నీటి బొట్టే. అవి కేవలం గ్రంథాలు కాదు. అనాథల్ని ఉద్ధరించడానికి ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలు. అతను స్వయంగా చేపట్టి చూపిన సామాజిక సంస్కరణా ప్రయోగాలు. హంటర్ కమీషన్‌కు అతను సమర్పించిన నివేదిక విద్యారంగంలో ఒక మైలురాయి.

జ్యోతిబా జీవితంలో చేసిన చివరి పోరాటం మంగలివాళ్లతో కలిసి చేసిన పోరాటం. బ్రాహ్మణ వితంతువులకు శిరోముండనం చేయడం అనాగరికంగా భావించి దాన్ని ఎదరించారు జ్యోతిరావు పూలే.

-LIGHTS ON-

## సన్నివేశం-16

**(బ్రాహ్మణుల వీధి)**

(భట్టు ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు వాకిలి ముందు ఎదురు చూపులు చూస్తున్నాడు. కులకర్ణి అటుగా వచ్చాడు... భట్టు ఎదురు చూపులు గమనించాడు)

**కులకర్ణి** : ఏమోయ్ భట్టు...! ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్లున్నావు.

**భట్టు** : ఉదయమనగా కబురు పంపాను మంగలి మార్తాండని రమ్మని ఇంతవరకు రాలేదు. అవతల ఫలహారం వేళ దాటిపోతుంది. కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి.

**కులకర్ణి** : వాడు రావడానికీ నీవు ఫలహారం చేయకపోవడానికీ సంబంధం ఏంటయ్యా బాబు! కొంపదీసి ఈ మధ్య వాడొచ్చి వంట చేస్తున్నాడేంటి మీ ఇంట్లో...

**భట్టు** : ఆపవయ్యా నీ హాస్యాలు... మా కోడలికి జుత్తు పెరిగింది. మడిగా వంట చేయడానికి పనికి రాదుగదా.... అందుకే మంగలిని రమ్మని కబురు పంపాను... ఇంతవరకు రాలేదు... వాడెప్పుడు రావాలీ...! ఎప్పుడు క్షురకర్మ చెయ్యాలి. అదెప్పుడు స్నానం చేసి మడిగట్టుకుని వంట చెయ్యాలి...ఛీ...ఛీ!.... ఒకరికీ సమయపాలన లేదు....

(మంగలి మార్తాండ మంగలిపొదితో వీధిలో వెళ్తున్నాడు)

**కులకర్ణి** : అదుగో వచ్చేశాడు... (మంగలి వీళ్ల ఇల్లు దాటి వెళుతున్నాడు)

**భట్టు** : ఇదిగో మార్తాండ్... ఎక్కడికి వెళ్లుతున్నావు. నిన్ను రమ్మని చెప్పింది మా ఇంటికే.. (మార్తాండ్ ఆగి చూసి దగ్గరికి వచ్చాడు...) ఏమిటయ్యా ఇంత ఆలస్యం చేసావు. మా కోడలు లోపలుంది. అలా పెరటి వైపుకు వెళ్లి పనిచూడు.

**మార్తాండ్** : ఇక మీదట అలాంటి పనులు చెయ్యకూడదని మా సంఘం వాళ్లు నిర్ణయించామండీ.

**కులకర్ణి** : ఎలాంటి పనులు?

**మార్తాండ్** : అదేనండి వితంతువులకు శిరోముండన చేయకూడదని గట్టిగా నిర్ణయం తీసుకున్నామండి.

**భట్టు** : ఏరోయ్! అంత ధీమాగా మాట్లాడుతున్నావు. మమ్మల్ని ఎదిరించి ఈ ఊళ్లో బతుకుదామనే.

**మార్తాండ్** : ఏంటండోయ్ బెదిరిస్తున్నారు. ఏం ఈ ఊరేమన్నా మీ బాబుగాడి సొత్తా.

**కులకర్ణి** : ఒరే మార్తాండ్! పెద్దాయనతో ఏమిటా మాటలు... అసలు శాస్త్రం ప్రకారం...

**మార్తాండ్** : చూడండీ మీ శాస్త్రాలు ఏం చెప్పాయో అందులో ఏమున్నాయో మాకనవసరం... మేము మాత్రం ఆ పని చెయ్యం చెయ్యం.

**భట్టు** : నువ్వు చెయ్యనంత మాత్రాన లోకం గొడ్డుపోదురా... పక్క ఊరినుండి పిలిపిస్తాను మనుష్యుల్ని.

**మార్తాండ్** : మీరిట్టాటి ఎదవ నిర్ణయాలు తీసుకుంటారనే అన్ని ఊళ్లలో కబురు పెట్టా... మేమంతా సంఘం పెట్టుకున్నాం! ఎవరూ వచ్చి ఆ పని చెయ్యరు.

**భట్టు** : గుర్తు పెట్టుకో... నేను ఈ మహారాష్ట్ర బ్రాహ్మణ సంఘానికి అధ్యక్షుడ్ని.

**మార్తాండ్** : నువ్వూ గుర్తు పెట్టుకో... నేను ఇదే మహారాష్ట్రలోని మంగళ్ల సంఘానికి అధ్యక్షుడ్ని.

**భట్టు** : మీ మంగళ్ల సంఘం. మా బ్రాహ్మణుల సంఘం ఒకటేనటరా. చూడూ! ఇటు చూడు! బరోడా మహారాజు ఒక సభకు వస్తూ మమ్మల్ని రమ్మని

ఆహ్వానించారు. అదిరా మా గొప్పతనం. (ఆహ్వాన పత్రిక తీసి చూపించాడు)

**మార్తాండ్** : ఏవండోయ్! ఆ ఆహ్వానం మాకూ వచ్చింది. (పొదిలోంచి ఆహ్వాన పత్రిక తీసి చూపించాడు)

**ఇద్దరు** : ఆహా! నీకు వచ్చిందా!

**మార్తాండ్** : అవును. ఇంతకూ బరోడా మహారాజు ఎందుకొస్తున్నారో తెలుసా. మా అణగారిన వర్గాల మహాత్ముడ్ని సత్కరించడానికి.

**భట్టు** : అణగారిన వర్గాల మహాత్ముడా! వాడెవడు!

**మార్తాండ్** : మా మహాత్ముడు జ్యోతిరావుఫూలే.

**కులకర్ణి** : జ్యోతిరావు ఫూలేని మహాత్ముడనడానికి మేం ఒప్పుకోం.

**మార్తాండ్** : మహారాజే మహాత్ముడనబోతున్నాడు. ఒప్పుకోకపోవడానికి నువ్వెవడివి... వస్తా. (వెళ్లబోయి ఆగాడు) విధవలకి గుండు గీయొద్దని చెప్పిందెవరో తెల్సా?

**ఇద్దరూ** : ఎవరూ.

**మార్తాండ్** : జ్యోతిరావు ఫూలే. కాదు మహాత్మా! జ్యోతిరావు ఫూలే.

**ఇద్దరు** : ఆ!

- LIGHTS OFF -

**వ్యాఖ్యానం** : జ్యోతిరావు ఫూలేను మహాత్మునిగా పిలవడం పరిపాటి అయిపోయింది. మహాత్మా అనే పిలుపు ప్రజల గుండెల్లోంచి వచ్చింది. అతని పట్ల ప్రజల హృదయాంతరాల నుండి పెళ్లుబుకుతున్న ప్రేమకు చిహ్నమది. గౌరవానికి ప్రతీక. అందుకే ప్రజలు జ్యోతిరావు ఫూలేను మహాత్మ బిరుదుతో సత్కరించాలనుకున్నారు. ఈ మహత్కార్యానికి వేదిక మాండ్వీలోని కొలివాడ వీధులు కాగా, సుముహూర్తం 1889– మే 11వ తేదీగా నిర్ణయించారు.

కానీ ఈ చర్యకు బ్రాహ్మణ సమాజం ఆగ్రహంతో ఊగిపోయింది. ఒక శూద్రునికి మహాత్మ బిరుదునివ్వడం చరిత్రను, శాస్త్రాన్ని, పాండిత్యాన్ని అవమానించడమేనని గొంతెత్తి అరిచింది. ఆ సభకు వస్తానన్న బరోడా మహారాజుకు తీవ్రంగా తన నిరసనను తెలియజేసింది.

-LIGHTS ON-

**బ్రాహ్మణ వర్గ**

**నిరసన స్వరం :** ఎవడురా ఈ మహాత్మా! ఎక్కడి వాడురా ఈ మహాత్మా! ఏ కులం వాడురా ఈ మహాత్ముడు. పాండిత్య ప్రకర్షతో, దివ్య జ్ఞానంతో, వర్చస్సుతో, చిరయశస్సుతో ఎప్పటికైనా బ్రాహ్మణుడే మహాత్ముడు కాగలడు కానీ, ఒక మాలీ కులస్థుడు, ఒక శూద్రుడు ఎప్పటికీ మహాత్ముడు కాలేడు. ఈ మహారాష్ట్ర నేలపై ఈ పూనా నగరంలో మహాపండితులు మత్తేబాలై విహరిస్తుండా, వేదవేదాంగ పారంగతులు, అధ్యాత్మిక జ్ఞాన సంపన్నులు, ఆర్షధర్మకోవిదులు ఉండగా ఒక శూద్రుడ్ని మహాత్మునిగా ఎలా పరిగణిస్తారు. సభాస్థలానికి ఎవరూ రాకుండా చేస్తాం. దారిలో గూండాలను ఏర్పాటు చేస్తాం. సభా వేదికను కూల్చేస్తాం. పూలహారాలల్లో పాముల్ని పెడతాం. పూనా నగరాన్ని కరపత్రాలతో కప్పెడతాం. నిరసన జ్వాలలతో ఈ ప్రపంచాన్నే భస్మీపటలం చేస్తాం. అవసరమైతే అతన్ని హతమార్చడానికి కూడా వెనుకాడం.

ఓ బరోడా మహారాజ్! సాయిజీ గైక్వాడ్! ఈ సభకు వస్తున్న మీకు మా నిరసనను తెలియచేస్తున్నాం. ఫూలేకు "మహాత్మ" బిరుదును మీ చేతుల మీదుగా ప్రదానం చేయడాన్ని బ్రాహ్మణ సమాజం ముక్తకంఠంతో అసమ్మతిని తెలియజేస్తోంది.

## సన్నివేశం-17

(సభా ప్రాంగణమంతా లక్షల మందితో నిండిపోయి ఉంది. పురోహిత వర్గం కరపత్రాలు పంచుతూ తమ వ్యతిరేకతను వ్యక్త పరుస్తూనే ఉంది. అయితే అందరిలోనూ ఒకటే ఉత్కంఠ – అది బరోడా మహారాజు ఈ సభకు వస్తాడా? రాడా? అని.

ప్రజలు జ్యోతిరావుపూలే జిందాబాద్ అని మిన్నంటే విధంగా నినాదాలు చేస్తున్నారు.

ఆ సభకు కార్మిక నాయకుడు శ్రీ లోఖండే అధ్యక్షత వహించారు. ప్రజల్లో ఉన్న ఉత్సాహాన్ని, కోలాహలాన్ని గమనించిన లోఖండే మాట్లాడుతున్నాడు)

**లోఖండే** : సభా సదులారా! నేడెంతో సుదినం... పోరాటానికి చిరునామా అయిన జోతిరావు పూలేకి "మహాత్మా" అని బిరుదునిచ్చి సత్కరించుకొనే అదృష్టం మనకు లభించిన శుభదినం. హిమాలయమంత ఎత్తు సముద్రమంత గంభీరత, గంగాజలమంతటి పవిత్రత కలిగిన మహానుభావుడు జ్యోతిరావుపూలే... అదిగో మన మహాత్ముడు జ్యోతిరావు పూలే వస్తున్నాడు...

(జ్యోతిరావుపూలే ఊరేగింపుగా సభాస్థలి చేరుకున్నాడు. అతను వేదిక పైకి వెళ్లగానే "పూలే మాట్లాడాలి – జ్యోతిబా మాట్లాడాలి" అని నినదించారు ప్రజలు – పూలే మాట్లాడ్డానికి ముందుకు వచ్చారు)

**పూలే** : నా తల్లిదండ్రులారా! నేను మీ బిడ్డను మాట్లాడుతున్నాను. నా ఈ శరీరం మీరు పోషిస్తేనే జీవిస్తోంది. మీరు రక్షిస్తేనే బతుకుతోంది. నేను సంవత్సరం బిడ్డగా వున్నప్పుడు మా అమ్మ చనిపోయింది. బ్రాహ్మణుల్ని ఎదిరించానని మా నాన్న నన్ను ఇంటి నుండి తరిమేశాడు. నా కులం నన్ను వెలివేసింది. అయినా నేను జీవించేవున్నాను. పోరాడుతూనే వున్నాను. దానికి బలం మీరే. ఈ రోజు మీ మధ్యలో మా నాన్న గోవిందరావు పూలే కూర్చొని వుంటే బాగుండేది. అందరి నాన్న లాగే మా నాన్న కూడా మంచివాడు. ఆయనకు 20 ఏళ్ల వయసప్పుడు మా అమ్మ చనిపోయింది. ఆమె పేరు చిమ్నాబాయి. నన్ను కనడానికే ఆమె పుట్టిందేమో. మా అమ్మ చనిపోయాక నన్నే తన పంచప్రాణాలుగా పెంచేడు మానాన్న. అలాంటి నాన్న నన్ను ఇంట్లోంచి తరిమేశాడు. ఎందుకు? భయం. జ్యోతిరావు గోవిందరావు పూలే గారూ అని నేను పిలిపించుకొంటానంటే భయం. కాని పిలిపించుకుంటే వినాలని ఆశ. ఆయనిప్పుడు ఈ సభలో మీ మధ్య వుంటే మీలాగే ఎంతో సంతోషించివుండేవాడు. ఇన్ని చేదు అనుభవాలు నాకో సత్యాన్ని తెలియజేసాయి. అదేమిటంటే Lessons in life will be better understood when they were learned through pain. యిక ఒక శూద్రుడికి మాలీ కులస్తుడికి, మహాత్మా బిరుదు ఇవ్వడం గురించ ఈ మహారాష్ట్రలో యింత రాద్ధాంతం జరిగింది. ఈ మహాత్మా బిరుదు ఈ రోజు నాకివ్వకపోతే ఏమిటి నష్టం? మహాత్మా బిరుదు ఈ రోజు నేను తీసుకోకపోతే నష్టం ఏమిటి? మహాత్మా బిరుదు నాకివ్వాలనుకొనప్పుడు బ్రాహ్మణ సమాజం

కంపించిపోయింది. మహాత్మా బిరుదు నాకు ఇవ్వకుండా చెయ్యడానికి అనేక కుటిల యత్నాలు చేశారు. చివరికిది అణగారిన కులాల ఆత్మగౌరవ సంగ్రామంగా మారింది. ఈ సంగ్రామంలో మనం గెలవాలంటే నేను ఈ మహాత్మా బిరుదు తీసుకొని తీరాలి. కాని... ఇవ్వడానికి బరోడా మహారాజు వస్తారో రారో అని సర్వత్రా ఉత్కంఠ. బరోడా మహారాజు వచ్చినా రాకపోయినా ఈ సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. రాజులది గతించిపోయిన చరిత్ర. అణగారిన కులాలది భవిష్యత్ చరిత్ర. బరోడా మహారాజు ఈ సభకు రాకుంటే ముగిసిపోయిన చరిత్రలో కలిసిపోతాడు. వస్తే మనం సృష్టించబోయే చరిత్రలో నిలిచిపోతాడు చిరస్థాయిగా.

(బరోడా మహారాజు వస్తున్న కోలాహలం)

**ప్రజలు** : శ్రీ సర్కార్ బరోడా మహారాజ్‌కి జయహో.

సంషేర్ బహద్దూర్ శాయిజీరావ్ బరోడా మహారాజ్‌కి జయహో.

(బరోడా మహారాజు ప్రవేశించాడు. అతన్ని వేదికపైకి సగౌరవంగా తోడ్కొని వెళ్లారు. ఉన్నతాసనం మీద కూర్చున్నాడు మహారాజు. లోఖండే ముందుకొచ్చారు.)

**లోఖండే** : మహాజనులారా! మనలో ఉన్న సందేహాలన్నీ నివృత్తి చేస్తూ మన బరోడా మహారాజు ఈ సభకు విచ్చేసారు. వారిని ప్రసంగించాల్సిందిగా ప్రజల పక్షాన సవినయంగా వేడుకుంటున్నాను.

**బరోడా మహారాజు :** సభకు నమస్కారం. మా ప్రజలందరికీ ఆశీస్సులు.

**ప్రజలు** : (హర్షధ్వానాలు చేస్తూ) జోతిరావుఫూలే – జిందాబాద్ – జోతిరావుఫూలే – జిందాబాద్

**బరోడా మహారాజు :** ఈ జయజయ ధ్వానాల వెనుక మాకు నిరసన ధ్వనులు కూడా వినిపిస్తున్నాయి. దారి పొడవునా విన్న నిరసన నినాదాల హోరు మా చెవుల్లో ఇంకా మారు మ్రోగుతూనే ఉంది. ఇంత సంచలనం ఇంత సంఘర్షణ మా పరిపాలనలో ఏనాడూ కనీ వినీ ఎరుగం. ఇంతటి సంచలనానికీ సంఘర్షణాత్మక వాతావరణానికీ కారణం ఒకే ఒక్క వ్యక్తి అంటే నమ్మశక్యం కాదు. అయినా నమ్మక తప్పదు. చరిత్రలో ఇటువంటి సన్నివేశాలు చాలా చాలా అరుదుగా వస్తుంటాయి. కేవలం ఒక్క వ్యక్తి

చేసిన చర్యల వల్ల, చేపట్టిన ఉద్యమాల వల్ల మహారాష్ట్ర అంతా నేడు రెండు శిబిరాలుగా విడిపోయింది. ఒక శిబిరం బ్రాహ్మణ అగ్ర వర్ణ సమాజం. మరో శిబిరం శూద్ర అతి శూద్ర అణగారిన వర్గాల సమాజం. ఈ అణగారిన వర్గాల శిబిరం ఒక వ్యక్తిని ఈ తరానికే మహాత్ముడు అంటున్నది. బ్రాహ్మణ సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఏది ఏమైనా ఈ ఒక్క వ్యక్తి కలిగించిన సంచలనం ఫలితంగా మహారాష్ట్రలో దారులన్నీ మా మండ్వీ వైపే పయనించాయి. ఈ ఒక్క వ్యక్తి గురించి మంచిగా నైనా చెడ్డగా నైనా నేడు మహారాష్ట్ర అంతా మాట్లాడుతోంది. ఇన్ని వాదాలకు వివాదాలకు నినాదాలకు కారణమయ్యాడంటే... ఆ వ్యక్తి ఎవరైనా కావచ్చుగాని మామూలు వ్యక్తి అయివుండడు. ఒక విశిష్ట వ్యక్తి అయివుంటాడనేది నిర్వివాదం. బ్రాహ్మణ సమాజం మా వద్దకు వచ్చి ఈ వ్యక్తికి మహాత్ముడు అన్న బిరుదు ఇవ్వరాదని విజ్ఞప్తి చేసింది. ఒకవేళ బిరుదు అంటూ ఇవ్వవలసి వస్తే మహాత్ముడు అన్న బిరుదుకు బదులుగా మరేదైనా బిరుదు ఇవ్వవచ్చునని సూచించింది. అమెరికాలో నల్ల జాతీయుల సర్వతోముఖ వికాసానికి కృషి చేసిన బుకర్ టి. వాషింగ్టన్‌ను గుర్తు చేస్తూ మన విశిష్ట వ్యక్తికి బుకర్ టి. వాషింగ్టన్ ఆఫ్ ఇండియా అని బిరుదు ఇవ్వవచ్చునని బ్రాహ్మణ సమాజం సలహా ఇచ్చింది. అంతేకాదు ఒక అట్టడుగు కులానికి చెందిన వ్యక్తికి మహాత్ముడు అన్న బిరుదు ఇవ్వడం తప్పు అనీ, అటువంటి సన్మాన కార్యక్రమానికి మేము హాజరు కావడం కూడా తప్పు అనీ హెచ్చరికలు చేస్తూ బ్రాహ్మణ సమాజం కరపత్రాలు ప్రచురించి పూణె నగరమంతా ఆ కరపత్రాలతో కప్పేసింది... ఈ వాద ప్రతివాదాల గురించి, సిద్ధాంతాల గురించి, రాద్ధాంతాల గురించి మేము సుదీర్ఘంగా లోతుగా సమాలోచనలు జరిపాం. ఒక నిర్ణయానికి వచ్చాం. మన సమాజంలో విశిష్టమైన వ్యక్తులను గుర్తించడంలోనూ, గౌరవించడంలోనూ, పెద్దపీట వేయవలసింది కులానికి కాదు గుణానికేనని నిర్ద్వందంగా తీర్మానిస్తున్నాం.

(ప్రజల హర్షధ్వానాలు)

మన దేశం, మన మహారాష్ట్ర, మన ప్రజలు, మన సంస్కర్తల్ని మనం గౌరవించుకునే సందర్భంలో మన భాషను మన భావజాలాన్ని ఉపయోగించడమే సముచితమని నిర్ణయిస్తున్నాం....

(ప్రజలు హర్షధ్వానాలు)

ఈ నిర్ణయాల ఫలితంగా మేము ఈనాడు... మన సమాజంలో శూద్ర అతిశూద్ర అణగారిన కులాల వికాసానికీ అభివృద్ధికీ ప్రాణాలొడ్డి మరీ పోరాటం సాగించిన మన విశిష్ట వ్యక్తి జ్యోతిరావు గోవిందరావు పూలే గారిని... ఈ మహాసభా! ... మా ప్రజలందరి సమక్షంలో... మా మనసాక్షిగా మా పూర్వీకుల సాక్షిగా... మహాత్మా అని సంబోధిస్తున్నాం...

(ప్రజల హర్షధ్వానాలు)

మహాత్మా జోతిరావు పూలే!

(ప్రజల హర్షధ్వానాలు మిన్నుముడుతున్నాయి)

ఈ బిరుదును శాసనబద్ధం చేస్తూ అధికార పూర్వకంగా పూలే గారికి బిరుదు ప్రదానం చేస్తున్నాం.

(పూలేకు సముచితరీతిన సత్కరిస్తూ బిరుదు ప్రదానం జరిగింది)

ఇది చరిత్రాత్మకమైన సన్నివేశం. జ్యోతిరావు పూలే గారికి మహాత్మాబిరుదు ప్రదానం చేస్తూ ఈ సన్నివేశంలో పాల్గొని చరిత్రలో స్థానం పొందుతున్నందుకు మేమూ సంతోషిస్తున్నాం. గర్విస్తున్నాం. చరిత్రాత్మకమైన ఈ సన్నివేశాలకు ఆధారాలు నిలపడానికా అన్నట్లు కరపత్రాలు ప్రచురించి నిరసనోద్యమం నిర్వహించిన బ్రాహ్మణ సమాజాన్ని కూడా అభినందిస్తున్నాం. అయితే ఈ నిరసనలు తిరస్కారాలు మహాత్మా జ్యోతిరావు పూలే గారి ఔన్నత్యాన్ని మరింత పెంచుతాయే గాని ఏ మాత్రం తగ్గించబోవని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాం. ఇక ఈ మహత్తర సన్నివేశంలో తమ సందేశాన్ని వినిపించవలసిందిగా పూలేగారిని ఆహ్వానిస్తున్నాం. (వెళ్లి తన ఆసనం మీద కూర్చున్నారు)

**పూలే** : ఈ రోజు ఈ మహాత్మా బిరుదును మహాత్మా – మహాత్మా – మహాత్మా అని తరతరాలనుండి పిలిపించుకొంటున్న బ్రాహ్మణభట్టుల నుండి మనం కైవసం చేసుకున్నాం. దీనిలో మీకందరికీ భాగస్వామ్యం వుంది. ఈ బిరుదు తీసుకొన్నందుకు నేనొక్కడినే మహాత్ముడ్ని కాదు. ఈ రోజు నుండి మీలో ప్రతి వొక్కరూ మహాత్ముడే. మీ అందరి తరపున మీకు బదులుగా నేను ఈ బిరుదును తీసుకొంటున్నాను. ఈ సభను భగ్నం చెయ్యనీయకుండా కంటికి రెప్పలా కాపాడిన ఇద్దరు యోధులకు ముందుగా నా నమస్కారాలు. ఒకప్పుడు ఈ ఇద్దరూ నన్ను

చంపడానికొచ్చారు. వాళ్లెవరో మీకు తెలుసు ఒకరు నాందేవ్ కుంభార్ రోడే మరొకరు ధోండీరామ్. వీళ్లే ఈ రోజు సభ సజావుగా జరగడానికి కారకులు. బ్రాహ్మణులకు వ్యతిరేకంగా నడిచిన ఈ ఉద్యమానికి రహస్యంగా తన నెల రోజుల జీతం పన్నెండు రూపాయలు విరాళంగా యిచ్చి మనకు వెయ్యేనుగుల బలాన్నిచ్చిన బ్రాహ్మణ భళ్లాచార్యకు నా కృతజ్ఞతలు. యిక యింకొక బ్రామ్మణుడున్నాడు నా జీవితం మలుపు తిరగడానికి కారకుడు. అలనాటి పెళ్లికొడుకు శంభాల్కర్‌ను మీ ముందు గుర్తు చేసుకొంటున్నాను. ఆనాడు అవమాన భారంతో వున్న నన్ను చూసి వొక్క నవ్వు నవ్వి నా ఆలోచనల్లో అగ్గిరగిలించిన మాంగ్ కోండిబాకి ఈ బిరుదులో భాగస్వామ్యముంది. ఎంత చెప్పినా మాటలు చేతలుగా మారాలంటే పనిచెయ్యాలి. లేకుంటే అది వృథా. నా భావాలను కార్యరూపంలో పెట్టిన మంగలి మార్తాండ్‌కు ఈ బిరుదులో భాగస్వామ్యముంది. ఇక మనలో ఇంత పోరాట శక్తి దాగుందని మనకు తెలియజేసిన బ్రాహ్మణ భట్టులకు ప్రత్యేక కృతజ్ఞతలు. మన కులాల్లో భార్యాభర్తలు ఎలా పిలుచుకొంటారో మనకు తెలుసు. యేమే – వొశేయ్ అని భర్త పిలుస్తాడు. యామయ్యో, ఇదిగో, ఓయ్ అని భార్యలు పిలుస్తారు. కాని నా భార్య సావిత్రి నన్ను సేఠ్‌జీ అని పిలుస్తుంది. ఇలా ఎవరు పిలుస్తారో తెలుసా? బ్రాహ్మణ బలియాలని వాళ్ల భార్యలు పిలుస్తారు. ఆ పిలుపులోని గర్వం, ఆత్మగౌరవం ఇంట్లోంచి బయటకు అడుగు పెట్టిన ప్రతిసారి సావిత్రి నాకు అందించింది. ఆ ఆత్మగౌరవమే నా భార్యను సావిత్రీ అని పేరు పెట్టి పిలిపించింది. (రమ్మని సైగ చేస్తాడు) ఈ రోజు ఈ ఆత్మగౌరవం అణగారిన కులాల ఆత్మగౌరవంగా మహాత్మా బిరుదుగా పరిణమించింది. సావిత్రి లేకుండా నేను లేను. మనది విలువలతో పోరాటమే గాని వ్యక్తులతో కాదు. కుల వ్యవస్థలో అణచివేత వున్నంత వరకు గులాంగిరికి వ్యతిరేకంగా సత్యాగ్రహం కొనసాగుతుంది. ఈ అగ్రవర్ణాలంటే నాకు భయం లేదు. నేను పోరాడగలను, పోరాడే శక్తి వుంది నాకు. కానీ అణగారిన కులాలంటేనే నాకు భయంగా వుంది. చిన్న చిన్న హామీలకు ప్రలోభాలకు లొంగిపోయి అగ్రవర్ణాల చేతికి నాయకత్వం ఇస్తారేమోనని భయంగావుంది. నా జాతి జనులారా! దెబ్బ తగిలిన జాతే కేక పెట్టాలి. మనం తిన్నదెబ్బలే ప్రత్యర్థి మీద ఎలా దెబ్బ తియ్యాలో నేర్పుతాయి. అది నేర్చుకోండి. మన మీద

మనం దెబ్బ తీయడం మానుకోండి. నాతో కలసి నడిచిన నా జాతి జనులందరికీ ఇవే నా కైమోడ్పు వందనాలు.

-LIGHTS OFF-

**వ్యాఖ్యానం** : మహాత్మ జోతిరావు ఫూలే ఆరోగ్యం క్షీణిస్తోంది. యశ్వంత్‌కి పిల్లనివ్వడానికి అటు బ్రాహ్మణులు ముందుకు రాలేదు. ఇటు శూద్రులు సాహసించలేదు. తను బ్రతికుండగా యశ్వంత్ పెళ్లి చూడలేమోనని దిగులు పడుతున్నాడు మహాత్మ ఫూలే... అటువంటి సందర్భంలో ఒకనాడు...

-LIGHTS ON-

## సన్నివేశం-18

**(ఫూలే ఇల్లు)**

**ఫూలే** : (ఒక బీరువాలో పుస్తకం కోసం వెతుకుతున్నాడు ఫూలే. ఒక ప్రక్క వెతుకుతుండగా మరోప్రక్క దగ్గు ముంచుకొస్తుంది) సావిత్రీ! సర్వజన సత్యధర్మ పుస్తకం వ్రాస్తూ వ్రాస్తూ ఇక్కడే పెట్టాను చూసావా? (లోనుండి విస విస వచ్చింది సావిత్రమ్మ)

**సావిత్రి** : సేఠ్‌జీ! మీరింత శ్రమ పడకూడదు. మీ వయసు సంగతి కూడా చూసుకోవాలి.

**ఫూలే** : ఆ మాట నేను నీకు చెప్పాలి. హద్దు పద్దూ లేకుండా పన్జేస్తున్నది నేను కాదు – నీవే.

**సావిత్రి** : అక్కడకు నేను పడిపోతున్న శ్రమేమిటట.

**ఫూలే** : ఏవిటా? నేనేదో నా తొందర్లో పిల్చానే అనుకో, తినే భోజనం కూడా వదలి ఆకలితో వస్తావుగా.

**సావిత్రి** : మీ దగ్గర కొచ్చేసరికి కడుపు నిండిపోయి ఆకలే ఉండదుగా.

**ఫూలే** : అలా అనుకొనే మొన్న కళ్లు తిరిగి పడ్డావ్.

**సావిత్రి** : పడగా పడగా ఎక్కడ పడ్డాను? మీ పాదాల మీదేగా, మీ పాదాలున్న చోటు నాకు కైలాసంతో సమానం. అక్కడ పడి కళ్లు మూసినా నాకు సంతోషమే, కానీ మీకే ఒకింత విశ్రాంతి అవసరం.

**పూలే** : యశ్వంత్ పెళ్లి అయ్యాక నువ్వన్న విశ్రాంతి కోసం ఆలోచిద్దాం. (అప్పుడే యశ్వంత్ అక్కడకు వచ్చాడు. అతనికి పదిహేడేళ్లుంటాయి) ఏరా యశ్వంత్!

**యశ్వంత్** : పొండి నాన్నా మీకన్నీ హాస్యాలే (అంటూ బయటకు పోబోయాడు – తల్లి ఆపింది)

**సావిత్రి** : ఇంత చక్కటి వాడ్ని చేసుకొనే అదృష్టం ఎవరికుందో (సిగ్గుపడుతూ వెళ్లిపోయాడు) నాకర్థమైంది. వాడికి పిల్ల నివ్వడానికెవరు ముందుకు రావడం లేదుకదూ!

**పూలే** : (ఔనని తలూపి) అవును... మన కులం వారెవ్వరూ పిల్లనిస్తామనడం లేదు. తల్లి బ్రాహ్మణ స్త్రీ అయినా కూడా మన దగ్గర పెరిగాడు కాబట్టి బ్రాహ్మణులు అస్సలు ముందుకు రావడం లేదు.

**సావిత్రి** : మీరేమీ దిగులు పడకండి. మీరెంతో మంది కోసం పన్జేసారు. మనకు తగిన అమ్మాయి దొరుకుతుంది. మనబ్బాయికి పిల్లనిస్తామని ఎవరో ఒకరు తప్పకుండా వస్తారు.

**పూలే** : స్సరే ఇది భద్రపర్చు.

**సావిత్రి** : ఏమిటిది?

**పూలే** : మన ఆస్థిపాస్థుల గురించి విల్లు.

**సావిత్రి** : (నవ్వాగింది కాదు) ఏంటిది విల్లు! మనకి ఆస్థిపాస్థులు, దానికో విల్లా! ఏమని రాసారు విల్లు చదవండి... చదవండి...

**పూలే** : నవ్వడం కాదు సావిత్రీ! మనం జీవితమంతా సత్యంతో ఎదురు బొదురుగా నిల్చాం. రేపటి సత్యాన్ని కూడా మనం ఆహ్వానించాలి.

**సావిత్రి** : ఏమిటది?

**పూలే** : మన తర్వాత, మన అబ్బాయి భవిష్యత్తు. మన చుట్టాలంతా కలిసి యశ్వంత్‌ని ప్రశాంతంగా బ్రతకనివ్వరు. అందుకే నా తర్వాత (చదువుతున్నారు) నా ఆస్థిపై నా సోదరులకు గానీ, నా మేనల్లుడికి గానీ ఎవ్వరికీ హక్కులేదు. పూణేలోని ఇల్లు, ఖానావాడిలోని పిత్రార్జితమైన ఇల్లు మా కుమారుడు యశ్వంత్‌కే చెందాలి. అంతేకాదు నా కుమారుడు, శూద్రుల విముక్తి పోరాడే యోధునిగా తయారు కావాలి. అతనెంతకాలం

పోరాడుతాడో అంతవరకే నా వారసునిగా పరిగణించబడతాడు. నా మరణానంతరం నా పార్థివ శరీరాన్ని ఉప్పుతో, సత్యశోధక సమాజం నియమాల ప్రకారం భూస్థాపితం చెయ్యాలి తప్ప దహనం చెయ్యరాదు. నా మృతదేహంపై పురోహిత వర్గంగానీ, వారి అనుయాయల నీడగాని పడడానికి వీలు లేదు. మా అంత్యక్రియలు చేసే హక్కు, అధికారం మా పుత్రుడు యశ్వంత్‌కే ఉన్నాయి.

**సావిత్రి** : (సాలోచనగా ఉండిపోయింది)

**పూలే** : ఏవిటి ఆలోచిస్తున్నావు. (బయటనుండి ధోండీబా వచ్చాడు)

**ధోండీ** : జ్యోతిబా! మీ కోసం జ్ఞానోబా వచ్చారు.

**పూలే** : రమ్మను. (బయట నుండి జ్ఞానోబా వచ్చాడు)

**జ్ఞానోబా** : నమస్తే జ్యోతిబా!

**పూలే** : నమస్కారం... చెప్పండి.

**జ్ఞానోబా** : ఏవీలేదు. మీ అబ్బాయి యశ్వంత్‌కి సంబంధం చూస్తున్నట్టు తెలిసింది.

**పూలే** : అవునవును. మీకు తెల్సి ఏదైనా సంబంధం ఉందా?

**జ్ఞానోబా** : ఉంది!

**సావిత్రి** : ఎవరు? పిల్ల ఎలా ఉంటుంది?

**జ్ఞానోబా** : చక్కగా ఉంటుంది. మీ అబ్బాయి కోసమే పుట్టినట్టుంటాది. కాకపోతే కొంచెం పెంకి పిల్ల. మీ ఇంటికొచ్చాక ఆ పెంకితనం పోతుందనుకోండి.

**పూలే** : ఇంతకూ ఆ పిల్ల తల్లిదండ్రులెవరు?

**జ్ఞానోబా** : తల్లి మా ఆవిడ. తండ్రి మా ఆవిడ భర్త. అంటే నేనే.

**పూలే** : జ్ఞానోబా గారు.

**జ్ఞానోబా** : ఏం నమ్మబుద్ధికావట్లేదా?.. ఏమ్మా నా కూతురు నీ కోడలిగా పనికిరాదా?

**సావిత్రి** : అయ్యయ్యో ఎంత మాట...

**పూలే** : అదికాదు! తర్వాత్తర్వాత వచ్చే పరిణామాల గురించి...

**జ్ఞానోబా** : బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. వచ్చాక మా బంధువులందర్నీ ఒక చోటకు పిలిచి ఒరేయ్! మా అమ్మాయిని పూలే కొడుక్కిచ్చి పెళ్లి చేస్తాను, మీ అభిప్రాయమేమిటని అడిగాను. దాంతో మా మేనమామ

కొడుకులు ఒక బ్రాహ్మణ విధవకు పుట్టిన వాడికి పిల్లనిస్తావా? ఆ పెళ్లే గనక జరిగితే నిన్ను ప్రాణాల్తో బ్రతకనివ్వమని హెచ్చరించారు. మరికొంతమంది నా ముఖం మీద తుప్పున ఉమ్మేసి వెళ్లిపోయారు. కాని జ్యోతిబా! మా అమ్మాయిని మీ అబ్బాయికే ఇస్తాను. ఎందుకంటే ఇంతవరకు దేవుడు ఎలా ఉంటారో ఏ మానవుడు చూడలేదు. కానీ ఇప్పుడు మాకా అదృష్టం కలిగింది. మా పాలిట దేవుడు మీరే. (అంటు కాళ్ల మీద పడిపోయాడు) (కానీ ఫూలేకు హఠాత్తుగా ఛాతిలో నొప్పి ప్రారంభమైంది. గుండెను నిమిరుకుందామని చెయ్యెత్తబోయాడు. కుడిచెయ్యి వంకర తిరిగిపోయింది)

**సావిత్రి** : సేఠ్‌జీ! సేఠ్‌జీ! యశ్వంత్! (యశ్వంత్ బయటనుండి వచ్చాడు)

**యశ్వంత్** : నాన్నా! నాన్నా! (అలా అతన్ని మంచం మీద పడుకోబెట్టారు)

LIGHTS OFF - LIGHTS ON

## సన్నివేశం-19

**నవంబరు 29, 1890**

**ఫూలే ఇల్లు**

(ఫూలే పూర్తిగా అస్వస్థుడై ఉన్నాడు. అతని చుట్టూ కుటుంబ సభ్యులు, మిత్రులు ఉన్నారు. అందరి హృదయాల్లోను దుఃఖం పెల్లుబుకుతోంది. ముఖాలు కమిలిపోయి నల్లబడ్డాయి)

**ధోండీ** : (బయటనుండి వస్తూ) అదిగో బాబా పద్మాంజీ వస్తున్నారు. వారికి దారివ్వండి (అందరూ తప్పుకోగా అతను ముందుకొచ్చాడు)

**పద్మాంజీ** : ఎలా ఉన్నారు.

**ధోండీ** : ఇప్పుడే అందరితో మాట్లాడారు, సత్యశోధక సమాజం వారినందర్నీ పేరు పేరున పిలిచి వారి వారి బాధ్యతల్ని అప్పగించారు.

**రోడే** : నిమ్న జాతుల్ని ప్రేమతో చూడమన్నారు.

**ధోండీ** : మహిళల పట్ల గౌరవ మర్యాదలతో మెలగమన్నారు... అదిగో కళ్లు తెరుస్తున్నారు... మహాత్మా!

**ఫూలే** : (కళ్లు తెరిచారు – బాబా పద్మాంజీకి నమస్కరించారు)

**పద్మాంజీ** : జోతిబా!

**పూలే** : (పక్కన కూర్చోమని సంజ్ఞ చేసాడు)

**పద్మాంజీ** : (పక్కనే కూర్చున్నాడు) ఎలా ఉంది.

**పూలే** : పుట్టిన ప్రతి జీవికి మరణం తప్పదు. అందరూ పోయిన దారినే నేనూ పోతున్నాను. (అందరూ గొల్లుమన్నారు)

**పద్మాంజీ** : చివరి కోరికలేమైనా?

**పూలే** : సార్వ జనిక్ సత్య ధర్మపుస్తక ప్రచురణ కాలేదు.

**ధోండి** : జోతిబా! ఆ పుస్తకాన్ని మోరో ప్రచురిస్తానని హామీ ఇచ్చారు. మీరు నిశ్చింతగా ఉండండి.

**పద్మాంజీ** : మీరు ఈ క్షణంలో దేని గురించి ఎక్కువ భయపడుతున్నారు.

**పూలే** : నా అరవయ్యేళ్ల జీవితంలో ఆరు వందల యేళ్లకు సరిపడిన ఉద్యమపునాదుల్ని వేసాను. దాన్ని నిర్మూలించడానికి అగ్రవర్ణాలతో పాటు, అభివృద్ధి చెందిన శూద్రులు, నిమ్న వర్గాలు ప్రయత్నిస్తాయి. వాళ్ల కన్న వీళ్లే ఎక్కువ ప్రమాదకరం. వీళ్లు చేయబోయే హాని గురించి ఎక్కువ భయపడుతున్నాను. (సావిత్రిను, యశ్వంత్‌ను దగ్గరకు పిలిచాడు. వాళ్ల ముఖాలు ప్రేమతో స్పృశించి ఆశీర్వదించాడు. బలాన్ని కూడగట్టుకొని లేచి కూర్చున్నాడు. అలా కూర్చున్నాడు వీపుకి ఆసరాగా దిండులు పేర్చారు. కూర్చున్న తర్వాత యశ్వంత్‌ని పిల్చాడు)

**పూలే** : యశ్వంత్! దేవుని ముందు దీపం వెలిగించు. (యశ్వంత్ దీపం వెలిగిస్తుండగా)... స్వామీ! ఇంక ఆలస్యం చెయ్యకు నీలో నన్ను కలుపు... ఏదీ అఖండ్‌ని ఆలపించండి. (మహాత్ముడు పాడటం ప్రారంభించాడు. అతని గొంతును మిగిలిన వారు అనుసరించారు)

అలా పాడుతున్న ఆ స్వరం ఆగిపోయింది. ఆ గుండె స్థంభించిపోయింది.

**సావిత్రి** : సేఠ్ జీ! (అంటూ అతని పై వాలిపోయింది)

**యశ్వంత్** : నాన్నా!

**ప్రజలు** : మహాత్మా! జ్యోతిబా! అయ్యో మమ్మల్ని వదిలి వెళ్లిపోయావా (అంటూ ప్రజలు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు)

**వ్యాఖ్యానం :** మహాత్మాజ్యోతిబా పూలే పేరులో ఉన్న జ్యోతి దేశానికి సమధర్మం చూపింది. పూలే పదం దళితులకు పూల బాటలు కూర్చే దారి చూపింది. ఈ దేశాన్ని నందనోద్యానంగా తీర్చిదిద్దడానికి అహరహం కృషి చేసిన తోటమాలి ఆయన. మానవతా పరిమళమూ, సమధర్మ మకరంద మాధుర్య విలసితమూ అయిన ఫలపుష్పాలతో నిండిన సమాజం కోసం ఆయన శ్రమించారు. ఆయన నాటిన విత్తనాలు మొలకలెత్తి, మొక్కలై, మహావృక్షాలుగా అభివృద్ధి చెందుతున్నాయి.

అయితే ఈ మహావృక్షాలే కొన్ని తమ తోటివారు అభివృద్ధి చెందకుండ అడ్డుకుంటున్నాయి. అలా అడ్డుకోకుండా సమ సమాజ అభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రయత్నిస్తున్న ప్రతీ ఒక్కరికీ – వారు అగ్రవర్ణమైనా, అల్పకులమైనా – ఈ నాటక ప్రదర్శన అంకితం.

సర్వేజనాః సుఖినోభవంతు

–సమాప్తం–